


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## ఇది పెను విపత్తు
# రాష్ట్రానికి నష్టమే



మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలపై సీఎం చంద్రబాబు బుధవారం ఏరియల్ వ్యూ నిర్వహించారు. బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఏరియల్ వ్యూ అనంతరం కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో ముఖ్యమంత్రి పర్యటించి.. క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేశారు. అక్కడి పునరావాస కేంద్రాన్ని సందర్శించి.. తుపాను బాధితులను పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, పరిహారం అందించారు. అనంతరం రోడ్డుమార్గంలో ప్రయాణించి వర్షాలకు నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంలో మొంథా తుపానును పెనువిపత్తుగా అభివర్ణించారు. రాష్ట్రానికి తీవ్రనష్టమే వాటిల్లిందని విచారం వ్యక్తం చేశారు. "మొంథా తుపానును ఎదుర్కోవడానికి ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. గతంలో తుపానుల సమయంలో పనిచేసిన అనుభవం నాకుంది. ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం లేకుండా చూడగలిగాం. ఆస్తినష్టం కూడా చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం. పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షం నమోదైంది. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం. కౌలు రైతులకు పరిహారం అందిస్తాం. మత్స్యకారులు, చేనేత కార్మికులకు అదనంగా 50 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నాం అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఐదు రోజుల్లోగా పంట నష్టానికి సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పంటనష్టం వివరాలను త్వరగా సేకరించేలా చూడాలన్నారు. అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, వాటిని కాపాడేందుకు ఉన్న అవకాశాలపై రైతులకు తగు సూచనలు చేయాలని నిర్దేశించారు. బుధవారం ఉదయం మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి, పర్యటన అనంతరం సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో... తుఫాన్‌వల్ల సంభవించిన నష్టంపైనా, తదుపరి తీసుకోవాల్సిన పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ యుద్ధప్రాతిపదికన జరగాలి. గురువారం ఉదయానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి. సాయంత్రానికి రహదారుల గుంతలు మరమ్మతులు పూర్తిచేయాలి. ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసులు యధావిధిగా కొనసాగించాలి. ఈ విషయాల్లో అధికారులు అలసత్వం వహించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవు.**

–సీఎం చంద్రబాబు నాయుడు

# 5 రోజుల్లో పంటనష్టాల నివేదికలు

- యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- 24 గంటల్లోగా పునరావాస శిబిరాల్లో కుటుంబాలకు రేషన్
- విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణే తక్షణ లక్ష్యం
- వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్యంపై దృష్టిపెట్టండి
- తాగునీరు కలుషితం కాకుండా చూడండి... నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- తుఫాన్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- తుఫాన్ అనంతర పరిస్థితులపై సమీక్షలో సీఎం చంద్రబాబు



2



3

## దన్నునిస్తూ.. ధైర్యం చెబుతూ..


- విపత్తు సమయంలో ప్రజలతోనేవున్న ముఖ్యమంత్రి
- తెల్లవారుఝాము 5గంటలనుంచే తుపాను పరిణామాలపై ఫోకస్

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు ప్రభుత్వం దగ్గరగావుంటే –ప్రజలు ధైర్యంగా ఉంటారన్న సిద్దాంతాన్ని నమ్మే సీఎం చంద్రబాబు –ప్రజలకు అందుబాటులో ఉంటూ విపత్తునుంచి రాష్ట్రాన్ని బయటపడేశారు. మొంథా తీవ్ర తుపాను హెచ్చరికలు వచ్చిన దగ్గర్నుంచీ –అనుక్షణం యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తూ.. సమాచార సరఫరాతో రాష్ట్ర ప్రజలకు దగ్గరగావున్న ముఖ్యమంత్రి –పెను తుఫాను తీరానికి చేరిన దగ్గర్నుంచీ తీరం దాటిన తరువాతా –ప్రజలకు అందబాటులో ఉండి ధైర్యం చెబుతూనే ఉన్నారు. ఒకపక్క సమీక్షలు, టెలికాన్ఫరెన్స్‌లతో యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తూ.. ప్రకృతి విపత్తును ధైర్యం ఎదుర్కొందామంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి 12 గంటల వరకూ సమీక్షలతో సచివాలయంలోనే గడిపిన ముఖ్యమంత్రి... బుధవారం ఉదయం 5 గంటలనుంచే తుఫాను సహాయక చర్యలపై ఫోకస్ పెట్టారు. మొంథా తుఫాను సహాయక చర్యలపై ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పర్యటన జరిపారు.



## 48 గంటలు.. బీ అలెర్ట్

- తఫాను ప్రభావిత ప్రాంతాలపై దృష్టి పెట్టండి
- సాధారణ స్థితి కల్పించేందుకు కృషిచేయాలి
- వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి నారా లోకేష్ ఆదేశాలు



4



5

## సూపర్ క్లోరినేషన్ సూపర్ శానిటేషన్

వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం ఆదేశం

5

## 'తుఫాను'నే గెలిచారు!

- ముఖ్యమంత్రి ముందస్తు చర్యలే శ్రీరామరక్ష
- అప్రమత్తంగా వ్యవహరించిన ప్రభుత్వం
- సమష్టి యుద్ధంతో సాధించిన విజయమిది
- తుపాను నష్టాన్ని నివారించగలగిన కూటమి

ప్రకృతి విపత్తులను ఆపలేకపోవచ్చు. కానీ అప్రమత్తతతో భారీ నష్టాన్ని నివారించవచ్చని సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిరూపించింది. సీఎం చంద్రబాబు అప్రమత్తంగా వ్యవహరించి.. రాష్ట్రస్థాయినుండి గ్రామస్థాయి వరకు యంత్రాంగాన్ని, సిబ్బందిని అలెర్ట్ చేయటంతో.. మొంథా తుఫాను పెనుముప్పును తప్పించగలిగారు. మొంథా తుఫానుకు సంబంధించి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు చేసే హెచ్చరికలు, సూచనలు ఆధారంగా కూటమి ప్రభుత్వం సకాలంలో స్పందిస్తూ తగు ముందస్తు భద్రత చర్యలను చేపట్టడంవల్ల భారీస్థాయిలో ప్రాణ, పశు, ఆస్తి నష్టాలను నివారించారు.



4

## విషాదంపైనా రాజకీయమా!

# ఐదు రోజుల్లో నష్టాల నివేదికలు

- మొంథా తుఫాన్‌తో పంటనష్టం వివరాలు కోరిన సీఎం
- 24 గంటల్లోగా పునరావాస శిబిరాల్లో కుటుంబాలకు రేషన్
- విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణే తక్షణ లక్ష్యం
- వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్యంపై దృష్టిపెట్టండి
- తాగునీరు కలుషితం కాకుండా చూడండి... నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- తుఫాన్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- తుఫాన్ అనంతర పరిస్థితులపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఐదు రోజుల్లోగా పంట నష్టానికి సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పంటనష్టం వివరాలను త్వరగా సేకరించేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, వాటిని కాపాడేందుకు గల అవకాశాలపై రైతులకు తగు సూచనలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. బుధవారం ఉదయం మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి, పర్యటన అనంతరం సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో... తుఫాన్‌వల్ల సంభవించిన నష్టంపైనా, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు సేకరించిన సమాచారం వరకు పరిశీలిస్తే... రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87 వేల హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందని, ఇందులో 59 వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో వరి పంటతోపాటు, ప్రత్తి, మొక్కజొన్న, మినుమువంటి పంటలు నీట మునిగినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 78,796 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. అలాగే 42 పశువులు చనిపోయినట్టు చెప్పారు. అయితే ఇది ప్రాథమికంగా ఉన్న అంచనాలు మాత్రమేనని.. క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూస్తుంటే... తుఫాన్ ప్రభావంవల్ల జరిగిన నష్టం ఇంకా పెరిగేలా ఉందని అధికారులు వెల్లడించారు.

### యధావిధిగా ఆర్టీసీ సర్వీసులు

సహాయక చర్యలు ఏవిధంగా కొనసాగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి.. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ తక్షణం జరగాలని ఆదేశించారు. బుధవారం రాత్రికల్లా విద్యుత్ సరఫరా చేయాలని, గురువారం నాటికి రహదారుల గుంతలు మరమ్మతులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసులు యధావిధి కొనసాగించాలన్నారు. ఈ విషయాల్లో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరమ్మతులకు గురైన ఫీడర్లను పునరుద్ధరిస్తున్నామని, కూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తస్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు వివరణ ఇచ్చారు. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను పటిష్ట పర్చాలన్నారు. పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని సూచించారు. జలాశయాల సమర్థ నీటి నిర్వహణకు జిల్లా కలెక్టర్లు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు గురువారంనాటికి బియ్యం, నిత్యావసరాల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సరఫరాకు ఇబ్బంది రాకూడదని, తాగునీరు కలుషితమైతే సహించేది లేదని, డయేరియా కేసులు నమోదుకాకుండా రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

### ప్రకాశం జిల్లాలో మెరుగైన చర్యలు చేపట్టాలి

ఒంగోలు పట్టణంలో పలు కాలనీలు నీట మునగడంపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబుపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ ఇటువంటి పరిస్థితి తలెత్తలేదని, భవిష్యత్‌లో పాలనా వైఫల్యం కనిపించకూడదని ముఖ్యమంత్రి చెప్పారు. తుఫాన్ రక్షణ చర్యలపై పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతీ జిల్లాలోనూ తుఫాన్ల సమయంలో తలెత్తే పరిస్థితులను అధిగమించేలా ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రోడ్లు, పునరావాస కేంద్రాలు, విద్యుత్-తాగునీటి సరఫరా వంటి విషయాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ప్రజాభిప్రాయం సేకరించి, లోపాలను సరిచేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారని అధికారులు వెల్లడించగా, మృతుల కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తుఫాన్ తీరం దాటడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తుఫాన్ తీవ్రస్థాయిలో లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారని, ప్రభుత్వం తీసుకున్న రక్షణ చర్యలపై ప్రజలనుంచి సానుకూల స్పందన, సంతృప్తి వ్యక్తమవుతోందని వెల్లడించారు.

### మొత్తం 1.16 లక్షలమందికి పునరావాసం

రాష్ట్రంలో 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో 1.16 లక్షల మందికి మొంథా తుఫాను సమయంలో ఆశ్రయం లభించింది. మొత్తం 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షలమందిపై తుఫాన్ ప్రభావం చూపింది. రాష్ట్రంలో 380 కి.మీ. పొడవున పంచాయతీరాజ్ రహదారులు, 14 బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతినగా రూ.4.86 కోట్ల నష్టం వాటిల్లింది. 2,294 కి.మీ. పొడవున ఆర్ అండ్ బీ రహదారులు దెబ్బతిని రూ.1,424 కోట్ల నష్టం వాటిల్లింది. రూరల్ వాటర్ సప్లయ్‌కు సంబంధించి రూ.36 కోట్లు, ఇరిగేషన్ పనుల్లో రూ.16.45 కోట్ల వరకు నష్టం సంభవించింది. సురక్షిత ప్రాంతాలకు 3,175మంది గర్భిణీలను తరలించారు. 2,130 మెడికల్ క్యాంపుల నిర్వహించారు. 297 రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా, వాటిని దారి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ తొలిగించారు. మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్ సహా ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# విద్యుత్ నష్టం 10.47 కోట్లు!

- 11సర్కిళ్లపై ప్రాథమిక నివేదిక ఇచ్చిన సీఎండీ
- విద్యుత్ పునరుద్ధరణ పనులపై సీఎంకు నివేదిక
- ప్రభుత్వ ముందస్తు చర్యలతో నష్టాలు నివారించగలిగామన్న సీఎండీ



విశాఖపట్నం (చైతన్య రథం): మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. బుధవారం కోనసీమ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విద్యుత్ పునరుద్ధరణ చర్యల పురోగతిని ఆయన వివరించారు. అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, పవర్ సాలు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లవంటి అవసరమైన సామగ్రి, సిబ్బందిని ముందస్తుగా అందుబాటులో ఉంచడంవల్ల పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. అమలాపురం డివిజన్ పరిధిలోని ఉప్పలగుప్తం, ఐనవోలు, అమలాపురం సబ్ స్టేషన్లలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను సీఎండీ పృథ్వీతేజ్ సమీక్షించారు. మొంథా తుపాను ప్రభావానికి సంస్థ పరిధిలోని 11 సర్కిళ్లలో రూ.10.47 కోట్ల నష్టం వాటిల్లిందని సీఎండీ తెలిపారు. 7,973 మంది విద్యుత్ సిబ్బంది 523 బృందాలుగా ఏర్పడి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. వర్షాలు, ఈదురుగాలుల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన ట్రాన్స్ఫార్మర్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్తు అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లు..

కార్పొరేట్ ఆఫీస్ -8331018762,
కాకినాడ -9490610856,
పెద్దాపురం -9493178728,
జగ్గంపేట -9490610097,
అమలాపురం -9490610101,
రామచంద్రపురం -9493178821,
నరసాపురం -7382050943,
భీమవరం -9490610143కు

ఫోన్ చేసి సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు తెలియజేసి పరిష్కారం పొందవచ్చని వినియోగదారులకు సీఎండీ విజ్ఞప్తి చేశారు.

## కోనసీమ పరిస్థితులపై
# సీఎంకు అచ్చెన్న నివేదిక



అమలాపురం (చైతన్య రథం): రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన మరియు మార్కెటింగ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతమైన డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పరిస్థితులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు సమగ్రంగా వివరించారు. మంత్రి అచ్చెన్నాయుడు జిల్లావ్యాప్తంగా పర్యటించి, తుఫాన్ ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.గాలులు,వర్షాల కారణంగా కొన్నిచోట్ల విద్యుత్‌సరఫరా అంతరాయం, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిన విషయాలను ముఖ్యమంత్రికి నివేదించారు. రైతుల పంటల నష్టం, రహదారి రవాణా అంతరాయం, పల్లె ప్రాంతాల్లో గృహాల దెబ్బతినిపరిస్థితులను వివరించారు. తుఫాన్ సమయంలో జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవడంపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్,రవాణా, తాగునీటి పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, అవసరమైన అన్ని వనరులు సమకూర్చినట్లు వివరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలపై ఎప్పటికప్పుడు సమీక్ష కొనసాగించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం చూపాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వయంత్రాంగం సమగ్రంగా పని చేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

# దన్నునిస్తూ.. ధైర్యం చెబుతూ..

- విపత్తు సమయంలో ప్రజలతోనేవున్న ముఖ్యమంత్రి
- తెల్లవారుఝాము 5గంటలనుంచే తుపాను పరిణామాలపై ఫోకస్
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- 'మొంథా' అనంతర పరిణామాలపై విస్తృత సమీక్షలు
- తుపాను తీరంతాకిన పరిసరాలకు వెళ్లిన ముఖ్యమంత్రి
- ఓడరేవులో బాధిత ప్రజలను కలిసి ధైర్యం చెప్పిన వైనం
- రోజంతా తుపానుపైనే గడిపిన సీఎం చంద్రబాబు
- రాత్రికి ఆర్టీజీఎస్‌లో ప్రభావిత ప్రాంతాలపై సమీక్ష



అమరావతి (చైతన్య రథం): ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు ప్రభుత్వం దగ్గరగావుంటే -ప్రజలు ధైర్యంగా ఉంటారన్న సిద్ధాంతాన్ని నమ్మే సీఎం చంద్రబాబు -ప్రజలకు అందుబాటులో ఉంటూ విపత్తునుంచి రాష్ట్రాన్ని బయటపడేశారు. మొంథా తీవ్ర తుపాను హెచ్చరికలు వచ్చిన దగ్గర్నుంచీ -అనుక్షణం యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తూ.. సమాచార సరఫరాతో రాష్ట్ర ప్రజలకు దగ్గరగావున్న ముఖ్యమంత్రి -పెను తుఫాను తీరానికి చేరిన దగ్గర్నుంచీ తీరం దాటిన తరువాతా -ప్రజలకు అందబాటులో ఉండి ధైర్యం చెబుతూనే ఉన్నారు. ఒకపక్క సమీక్షలు, టెలికాన్ఫరెన్స్‌లతో యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తూ.. ప్రకృతి విపత్తును ధైర్యం ఎదుర్కొందామంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి 12 గంటల వరకూ సమీక్షలతో సచివాలయంలోనే గడిపిన ముఖ్యమంత్రి... బుధవారం ఉదయం 5 గంటలనుంచే తుఫాను సహాయక చర్యలపై ఫోకస్ పెట్టారు. మొంథా తుఫాను సహాయక చర్యలపై ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పర్యటన జరిపారు.

**ఉదయం 5 గంటలకే** రోజును ప్రారంభించిన సీఎం చంద్రబాబు.. వివిధ వర్గాలనుంచి, ప్రసార మాధ్యమాలనుంచి వస్తున్న సమాచారం ఆధారంగా ఎప్పటికప్పుడు అధికారులను, ప్రభుత్వ విభాగాలను అలెర్ట్ చేయడం మొదలుపెట్టారు.

**ఉదయం 9 గంటలకు** తుఫాను ఎఫెక్ట్, రాష్ట్రవ్యాప్త పరిస్థితిపై సీఎంవో, ఆర్టీజీ అధికారులతో చర్చించి సమాచారం తీసుకున్నారు.

**ఉదయం 10 గంటలకు** రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం... ఆయా ప్రాంతాల్లో గ్రామస్థాయి పరిస్థితులపై ఆరా తీశారు.

తుఫాను సమయంలో ప్రాణ, ఆస్తినష్టం నియంత్రణకు తీసుకున్న చర్యలపై అధికారులతో మాట్లాడిన సీఎం... బుధవారంనాటి ప్రణాళికపై అధికారులు, మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు.

క్షేత్రస్థాయిలో ఉండి చాలా ఎఫెక్టివ్‌గా పనిచేశారంటూ టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులు, ఉద్యోగులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

**ఉదయం 11 గంటలకు** తుఫాను బాధితులకు బియ్యం, నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించే విషయంపై సమీక్ష నిర్వహించారు. బాధిత ప్రజలను ఆదుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**మధ్యాహ్నం 12:30కు** అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వేకు సీఎం చంద్రబాబు బయలుదేరారు.

పల్నాడు, బాపట్ల, కృష్ణా, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో ఏరియల్ సర్వే ద్వారా ఆయా ప్రాంతాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు.

చిలకలూరిపేట, పరుచూరు, చీరాల,బాపట్ల, నాగాయలంక, మచిలీపట్నం, కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడరేవువరకు ఏరియల్‌విజిట్ సాగించారు.

దాదాపు గంటన్నరపాటు ఏరియల్ విజిట్ అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడరేవులో హెలిపాడ్ వద్ద చంద్రబాబు ల్యాండయ్యారు.

**2:15కు** జెడ్ క్యాటగిరీస్థాయి భద్రత లేకుండా, బుల్లెట్ ప్రూఫ్ వాహనం లేకుండా, సాధారణ వాహనంలో పూర్తిస్థాయి సెక్యూరిటీ లేకుండా ప్రజలమధ్యకు ముఖ్యమంత్రి పర్యటన సాగింది.

ఓడరేవు సమీపంలోని పునరావాస కేంద్రంలో దాదాపు అరగంటపాటు తుఫాను బాధితులతో మాట్లాడి వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. ప్రభుత్వంనుంచి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బాధిత వర్గాలకు కలుసుకుని ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

తుఫాను బాధిత ప్రజలకు సీఎం చంద్రబాబు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

అనంతరం అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలతో ముఖ్యమంత్రి ముచ్చటించారు.

**మధ్యాహ్నం 3 గంటలకు** అరగట్లపాలెం, బెండమూరు లంకలో నీటి మునిగిన పొలాలను స్థానికులతో కలిసి పరిశీలించారు. రైతులకు జరిగిన నష్టానికి పరిహారంపై హామీ ఇచ్చారు. పొలంలోకివెళ్లి అన్నదాతలతో సీఎం చంద్రబాబు చర్చించారు.

**సాయంతకు 4:30కు** క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మళ్లీ హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. తిరుగు ప్రయాణంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన, అమలాపురం, అంబాజీపేట, మండపేట, రాయవరం, ఏలూరు జిల్లా ముదినేపల్లి గ్రామాల్లో తుఫాను ప్రభావం, పంటనష్టాన్ని ఏరియల్ వ్యూ ద్వారా ముఖ్యమంత్రి పరిశీలించారు.

**సాయంత్రం 5:30కు** ఏరియల్ విజిట్ ముగించుకుని నేరుగా సచివాలయం సమీపంలోని హెలిపాడ్‌వద్ద సీఎం చంద్రబాబు ల్యాండయ్యారు.

**సాయంత్రం 6 గంటలకు** సచివాలయ రియల్ టైం గవర్నెన్స్ సెంటర్ నుంచి మంత్రులు, అధికారులతో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పంట నష్టం, బాధిత కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ సాయంపై సమీక్ష నిర్వహించారు.

ఏరియల్ విజిట్‌లో గమనించిన అంశాలు, బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అందించాల్సి సాయంపై అధికారులతో చర్చించారు.

**రాత్రి 7:30కు** సచివాలయంలో ఆర్టీజీ సెంటర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను అనంతర పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.










# తుపాను వేగంతో నష్టాల అంచనాలు!



తుపాను బాధితులకు ప్రభుత్వ ఆర్థిక సాయం

- మంత్రులు, కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం
- తుపాను ప్రాంత ప్రజలకు నిత్యావసరాలు ఇవ్వండి
- నష్ట నివారణకు టీంవర్క్‌గా పనిచేయడమే కారణం
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలన్న సీఎం

అమరావతి (చైతన్య రథం): తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరకులు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్లు, అధికారులు, మంత్రులతో బుధవారం ఉదయం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. తుపాను నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, మంత్రులకు సూచనలు చేశారు. "సమర్థంగా వ్యవహరించి నష్ట నివారణ చర్యలు చేపట్టాం. సీఎం నుంచి సచివాలయం సిబ్బంది వరకు అందరం టీమ్‌గా పనిచేశాం. కష్టకాలంలో బాధితుల కోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు. మరో రెండురోజులు ఇలానే పనిచేస్తే.. మరింత ఊరట ఇవ్వగలం. మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి. ప్రభుత్వం ఏంచేసిందో చెబుతూ సమస్యలుంటే అడిగి తెలుసుకోవాలి. వివిధ విభాగాల్లో నష్టం అంచనా వేసి కేంద్రానికి నివేదిక అందించాలి" అని యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు."తుపానును నివారించలేం.. ముందు జాగ్రత్తలతో చాలావరకు నష్టాన్ని నివారించగలిగాం. సచివాలయాలపై మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టంను ఏర్పాటు చేసి కిందిస్థాయి వరకూ ప్రభుత్వ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాం. వైపరీత్యాల సమయంలో ఉపయుక్తమైన నూతన విధానం తీసుకొచ్చాం. కలెక్టర్లు, అధికారులు రియల్ టైమ్ సమాచారం తెప్పించుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా, విద్యుత్ తీగలు తెగిపడినా యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మున్సిపాలిటీల్లో డ్రెయిన్ల శుభ్రంవల్ల ముంపుబారిన పడకుండా చేశాం. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు 10 వేలమందిని అందుబాటులో ఉంచాం. ఇవాళ మధ్యాహ్నానికి సాధారణ స్థితి ఏర్పడుతుంది. తుపాను కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై ప్రజలకు భరోసా పెరిగింది." అని చంద్రబాబు పేర్కొన్నారు.

మొంథా తుపాను బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పునరావాస కేంద్రాలకు వచ్చిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. కుటుంబంలో ముగ్గురికంటే ఎక్కువ ఉంటే గరిష్ఠంగా రూ.3 వేలు అందజేయాలని పేర్కొంది. పునరావాస కేంద్రంనుంచి ఇంటికి వెళ్లేముందు ఈ నగదు ఇవ్వనున్నారు. ఈమేరకు విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# 48 గంటలు.. బీ అలెర్ట్



- తుపాను ప్రభావిత ప్రాంతాలపై దృష్టి పెట్టండి
- సాధారణ స్థితి కల్పించేందుకు కృషిచేయాలి
- నష్టాలపై పూర్తిస్థాయి నివేదికలివ్వండి..
- వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి నారా లోకేష్ ఆదేశాలు

అమరావతి (చైతన్య రథం): మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ సచివాలయం నుంచి బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో 48 గంటలపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలతో రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించేందుకు అగ్నిమాపకశాఖ తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గృహాలు, వాణిజ్య సముదాయాలకు వందశాతం విద్యుత్‌ను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. మొంథా తీవ్ర తుఫాను ప్రభావంతో జరిగిన ప్రాణనష్టం, దెబ్బతిన్న నిర్మాణాలను నివేదించాలని ఆదేశించారు.

వర్షాలకు దెబ్బతిన్న వివిధ పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పంటనష్టం అంచనాలను రూపొందించాలన్నారు. వంతెనలు, కల్వర్టులను పర్యవేక్షించడంతోపాటు వర్షాల దాటికి దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువగట్లను పటిష్టపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టడంతో పాటు పాముకాటుకు ఉపయోగించే ఔషధాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం నిర్వహణతోపాటు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

మత్స్యకారులు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అవసరమైన నిత్యావసర సరకులను పంపిణీ చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి బాధితులకు అవసరమైన సహాయక చర్యలు అందించాలని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ఆదేశించారు. హెూంమంత్రి అనిత, సీఎస్ కె విజయానంద్, ఆర్టీజీఎస్ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తదితరులు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.


# విషాదంపైనా రాజకీయాలా?

వైసీపీ అసత్య ప్రచారాలపై ధ్వజమెత్తిన లోకేష్




అమరావతి (చైతన్య రథం): విపత్తుల సమయంలో మానవత్వం ఉన్న ఎవరైనా ప్రజలకు సాయం చేస్తారని.. వైసీపీ అధ్యక్షుడు జగన్ మాత్రం ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తూ విష రాజకీయాలు చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బెంగళూరు ప్యాలెస్‌లో సేదతీరుతూ దొంగ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్నారని మండి పడ్డారు. ఈమేరకు లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "కాకినాడ జిల్లా కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లోని పునరావాస కేంద్రంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అక్కడ ఉన్నవారికి ఎలాంటి లోటులేకుండా చర్యలు తీసుకున్నాం. వదంతులు నమ్మొద్దు.. ఇది ప్రజల ప్రభుత్వం. అత్యవసర సాయానికి టోల్ ఫ్రీ నంబర్ 18004250101 ఏర్పాటు చేశాం" అని లోకేశ్ పోస్టులో స్పష్టం చేశారు.

# వాయుగుండంగా.. బలహీనపడిన మొంథా



విశాఖ (చైతన్య రథం): మొంథా తుపాను.. తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆంధ్రా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ భూభాగంపై ఇది కొనసాగుతోంది. దీని ప్రభావంతో తీరంవెంట 55నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. 'మొంథా' క్రమంగా బలహీనపడుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. ఈమేరకు ఆ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ ప్రకటన విడుదల చేశారు. "తుపాను ప్రభావంతో నేడు ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే వీలుంది. కాకినాడ, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది" అని అధికారులు తెలిపారు. కోస్తాంధ్రలో ఈదురుగాలులు వీస్తాయని.. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మొంథా తుపాను నరసాపురం వద్ద మంగళవారం రాత్రి 11.30 – 12.30 గంటల మధ్య తీరం దాటిన విషయం తెలిసిందే..

# 127 రైళ్లు తాత్కాలిక రద్దు



విజయవాడ (చైతన్య రథం): మొంథా తుపాను తీరం దాటిన నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది.

127 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతోపాటు మరో 14 రైళ్లను దారి మళ్లించింది. ఫలక్‌నుమా, ఈస్ట్‌కోస్ట్, గోదావరి, విశాఖ, సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేశారు. వర్షాల కారణంగా పలు రైల్వేస్టేషన్లలో ఎక్కడికక్కడే రైళ్లు నిలిచిపోయాయి. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గుండ్రాతిమడుగులో కోణార్క్ ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. ఏపీలోని కృష్ణా జిల్లా కొండపల్లిలో సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. ఏపీలోని పలు స్టేషన్లలో 12 గూడ్స్ రైళ్లు నిలిచిపోయాయి.

# 'మొంథా'ను గెలిచారు!

- ముఖ్యమంత్రి ముందస్తు చర్యలే శ్రీరామరక్ష
- అప్రమత్తంగా వ్యవహరించిన ప్రభుత్వం
- సమష్టి యుద్ధంతో సాధించిన విజయమిది
- తుపాను నష్టాన్ని నివారించగలగిన కూటమి
- అనంతర పరిణామాలపైనా ముందస్తు చర్యలు



అమరావతి (చైతన్య రథం): ప్రకృతి విపత్తులను ఆపలేకపోవచ్చు. కానీ అప్రమత్తతతో భారీ నష్టాన్ని నివారించవచ్చని సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిరూపించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అప్రమత్తంగా వ్యవహరించి.. రాష్ట్రస్థాయినుండి గ్రామస్థాయి వరకు యంత్రాంగాన్ని, సిబ్బందిని అలెర్ట్ చేయటంతో.. మొంథా తుఫాను పెనుముప్పును తప్పించగలిగారు. మొంథా తుఫానుకు సంబంధించి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు చేసే హెచ్చరికలు, సూచనలు ఆధారంగా కూటమి ప్రభుత్వం సకాలంలో స్పందిస్తూ తగు ముందస్తు భద్రత చర్యలను చేపట్టడంవల్ల భారీస్థాయిలో ప్రాణ పశు ఆస్తి నష్టాలను నివారించారు. అల్పపీడన ప్రభావంతో అక్టోబర్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఓ మోస్తరుగా కురవాల్సిన వర్షాలు 27వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారి "మొంథా" తుపానుగా రూపాంతరం చెందింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ముందుగా ఈనెల 17నే మొంథా తుఫాను ముప్పును హెచ్చరించిన నేపథ్యంలో.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రతి జిల్లాకు ఐఏఎస్‌స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించి తుఫాను ముప్పు నివారణ చర్యలను ముందస్తుగా చేపట్టారు. ముఖ్యమంత్రి నిరంతర సమీక్షలు, సూచనలతో తుపానువల్ల సంభవించే నష్టాలను నియంత్రించే దిశగా అధికార యంత్రాంగం గత మూడు రోజులుగా విధులు నిర్వహించింది. రాష్ట్రమంత్రులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తుఫాను ముప్పు నివారణ చర్యలను పర్యవేక్షించారు.

విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి రాష్ట్ర హోమ్, విపత్తుల మంత్రి వంగలపూడి అనిత, విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ ప్రఖర్ జైన్ పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు, తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో 27నుంచి అన్ని శాఖల అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండేలా విధులు కేటాయించి, తుపానుకు సంబంధించిన సమాచారాన్ని అన్ని జిల్లాలనుంచి ఎప్పటి కప్పుడు సేకరిస్తూ, నష్ట నివారణ దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేసింది. తుపాను నేపథ్యంలో తీరప్రాంత జిల్లాల్లో ప్రజలకు అండగాఉంటూ, సహాయక చర్యలు చేపట్టడానికి శిక్షణ పొందిన ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బలగాలను ప్రభుత్వం పంపించింది. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు తుపాను, వర్ష ప్రభావిత జిల్లాల్లో ప్రజలకు అవసరమైన వసతి, సౌకర్యాలు కల్పించడానికి అన్ని జిల్లాలకు నిధులను కేటాయిస్తూ ప్రభుత్వం ముందస్తు ఉత్తర్వులు జారీ చేసింది.

రక్షణ చర్యల్లో భాగంగా వరద ప్రాంత ప్రజల కోసం రాష్ట్రవ్యాప్తంగా 320 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, కేంద్రంలోని ప్రజలకు అల్పాహారం, భోజనం త్రాగునీరు, పాలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది.

వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి నిరంతరం ప్రజల ఆరోగ్యాన్ని పర్యవేక్షించింది. రాకపోకలకు, రవాణా సౌకర్యం ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు రహదారులను క్లియర్ చేసే బృందాలను ఏర్పాటు చేసింది. విద్యుత్ అంతరాయాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంది. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించే చర్యలు చేపట్టింది. ప్రజలకు నిత్యవసర సరుకులను ఉచితంగా పంపిణీ చేసింది. ఈవిధంగా ప్రతి అంశంలోనూ ప్రభుత్వం ఎంతో అప్రమత్తతో ఉండటంవల్ల భారీస్థాయిలో తుఫాను ముప్పు నష్టాన్ని నివారించడమే కాకుండా ప్రాణ, పశు, ఆస్తి నష్టాలను సాధ్యమైనంతమేర నివారించగలిగింది. తుఫాను ముప్పు నష్టాన్ని భారీస్థాయిలో నివారించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటం ప్రభుత్వం ఘనవిజయంగా అభివర్ణించొచ్చు.





# సూపర్ క్లోరినేషన్.. సూపర్ శానిటేషన్

- పకడ్బందీ పారిశుద్ధ్య పనులకు మొబైల్ బృందాలు
- రోడ్ల పునరుద్ధరణకు తక్షణ చర్యలు తీసుకోండి
- తాగునీటి సరఫరాకు ఇబ్బందివుంటే ప్రత్యామ్నాయ చర్యలు
- తుపాను అనంతర కార్యచరణపై డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్



అమరావతి (చైతన్య రథం): 'మొంథా తుపానును సమర్థంగా ఎదుర్కొన్నాం. ఇప్పుడు తుపాను అనంతర చర్యలు అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖలు యుద్ధప్రాతిపదికన పని చేయాలి. పటిష్టమైన ప్రణాళికతో, సమన్వయంతో ముందుకెళ్లాలి. తుపాను, భారీ వర్షాలుతగ్గాక గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశముంది. ఎక్కడా ఇబ్బందులు లేకుండా దీనిని సమర్థవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉంద'ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. తుపాను ప్రభావం తీవ్రంగావున్న గ్రామాల్లో సూపర్ క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ కార్యక్రమాలు మొదలుపెట్టాలన్నారు. తుపాను ప్రభావంవల్ల పాడైన రోడ్లను ప్రాధాన్యం ప్రకారం మరమ్మతు చేయాలన్నారు. మొంథా తుపాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలను తక్షణమే మొదలుపెట్టాలని సూచించారు. మొంథా తుపానుకు 1583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. శానిటేషన్ సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకున్నామన్నారు. 38చోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయని, మరో 125చోట్ల రహదారులకు గుంతలు ఏర్పడ్డాయన్నారు. రక్షిత తాగునీటి పథకాల ట్యాంకులు దగ్గర క్లోరినేషన్ ప్రక్రియ చేస్తున్నామన్నారు.

పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "తాగునీటిని అందించే పథకాలకు, నీటి సరఫరాకు ఏమైనా ఇబ్బందులుంటే ప్రత్యామ్నాయం చూడాలని, తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. "గ్రామాల్లో మొబైల్ శానిటేషన్ బృందాలను సిద్ధంగా ఉంచండి. 21,055 మంది పారిశుద్ధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటుచేసి పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టండి. వాన నీరు నిలిచిన ప్రాంతాల్లో నీటిని బయటకు పంపే చర్యలు తీసుకోవాలి. తాగునీరు కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ తరుణంలో దోమలవల్ల వచ్చే వ్యాధులు పెరుగుతాయి. వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అరికట్టాలి. మూడు, నాలుగు రోజులపాటు పారిశుద్ధ్య నిర్వహణపై పూర్తిగా దృష్టి సారించండి. మళ్లీ సాధారణ పరిస్థితి వచ్చేవరకు గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలి" అని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### తుపాను ప్రాంతాలపై

# సీఎం ఏరియల్ వ్యూ

## ఓడలరేవులో దిగి ప్రజలను కలిసిన చంద్రబాబు









అమరావతి(చైతన్య రథం):మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఏరియల్ సర్వే నిర్వహించారు. బుధవారం తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వెళ్లిన చంద్రబాబు.. హెలీకాప్టర్‌లో ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ముంపునకు గురైన ప్రాంతాలను హెలికాప్టర్ నుంచి పరిశీలించారు. ఏరియల్ వ్యూ అనంతరం కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో సీఎం పర్యటించారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ప్రయాణించి వర్షాలకు నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు. అలాగే, చిలకలూరిపేట, పర్చూరు, చీరాల, కోడూరు, నాగాయలంక మీదుగా ఓడలరేవు వరకు ఏరియల్ విజిట్ చేశారు.

### మొదలైన నష్టాల అంచనాలు

మొంథా తుపానువల్ల సంభవించిన నష్టం అంచనా ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. తుపానువల్ల రాష్ట్రంలో ఇద్దరు మృతి చెందినట్టు అధికారులు గుర్తించారు. ప్రాథమిక అంచనా నివేదికను రెండ్రోజుల్లో ప్రభుత్వానికి నివేదించే అవకాశం ఉంది. అంచనాలు వచ్చాకే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించనుంది. 249 మండలాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షలమందిపై తుపాను ప్రభావం ఉన్నట్టు తెలుస్తోంది. పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో ఈదురు గాలులకు చాలాచోట్ల కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది.

### భారీ వర్షాలతో అతలాకుతలం

మొంథా తుపాను ప్రభావంతో ప్రకాశం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఒంగోలులో రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. ఎగువ కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరింది. అధికారులు 11 గేట్లుఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మార్కాపురంలో తుపాను ధాటికి పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. అర్ధవీడులో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. జోరువానలకు కంభం చెరువు జలకళను సంతరించుకుంది.

ఇక కడప జిల్లాలో కుందూ నది ఉగ్రరూపం దాల్చింది. చాపాడు మండలం సీతారామపురంవద్ద వంతెనపైనుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచి పోయాయి. పోలీసులతోపాటు రెవెన్యూ అధికారులు అప్రమత్తమై నిఘా పెట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు కడప జిల్లాలో విస్తారంగా వర్షాలు పడటంతో వాగులు, వంకలనుంచి కుందూ నదికి వరద ప్రవాహం పెరిగింది. నంద్యాల–కడప జిల్లాల సరిహద్దులోని రాజోలి ఆనకట్ట వద్ద మంగళవారం 7 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. 24 గంటల్లో 26 వేల క్యూసెక్కులకు చేరింది. చాపాడు మండలం సీతారామపురం వద్ద 30 వేల క్యూసెక్కులు ప్రవహిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మొంథా తుపాను ప్రభావంతో నల్లమల ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి రహదారిపై పడ్డాయి. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. పెద్ద దోర్నాలలోని అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద వాహనాలను శ్రీశైలం వైపునకు వెళ్లకుండా నిలిపివేశారు. వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పడిన రాళ్లను పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు.



# పల్లెపాలెంలో పరిస్థితి సమీక్షించిన మంత్రి అచ్చెన్న

## పునరావాస కేంద్రంలో బాధితులకు దుప్పట్లు, మందులు పంపిణీ

కోనసీమ (చైతన్య రథం): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పునరావాస చర్యల పరిశీలనకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన మరియు మార్కెటింగ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం కోనసీమ జిల్లాలోని అంతర్వేది మండలం పల్లెపాలెంలో పర్యటించారు. తుఫాన్ సమయంలో గాలివానలు, అధిక వర్షాల ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందని మంత్రి తెలిపారు.





పల్లెపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారి అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులకు దుప్పట్లు, మందులు, అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. తరువాత మంత్రి అచ్చెన్నాయుడు గోదావరి నది సముద్ర సంగమ స్థలమైన అంతర్వేది వద్ద తుఫాన్ ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. గోదావరి ప్రవాహం మరియు సముద్ర అలల పరిస్థితిని తెలుసుకుంటూ, స్థానిక మత్స్యకార కుటుంబాలతో మాట్లాడి వారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత. ఎటువంటి పరిస్థితుల్లోనూ బాధితులు నిరాశచెందకుండా చూడడం ప్రభుత్వబాధ్యత అని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.






తుపాను పునరుద్ధరణ చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిమగ్నమయ్యాయి. నిజాంపట్నం నుంచి రేపల్లె రొడ్డు మార్గంలో పడిన చెట్లను తొలగిస్తున్న రెస్క్యూ బృందాలు. మచిలీపట్నం మంగినపూడి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలంగించి, రోడ్డు క్లియర్ చేసిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది. అనకాపల్లి, మచిలీపట్నంలో పడిన చెట్లను రెస్క్యూ బృందాలు ఆగమేఘాలమీద క్లియర్ చేశాయి.











పర్చూరు ప్రాంతంలో పొంగిపొర్లుతున్న వాగులో మునిగిన ఓ ప్రార్థనా మందిరం నుంచి 15మందిని ప్రాణాలకు తెగించి కాపాడుతున్న పోలీసు, రెవెన్యూ అధికారుల బృందం. సమాచారం అందుకున్న 10 నిముషాల్లోనే ఘటనా స్థలికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన అధికారులు

# పంట నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు

- యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ
- ప్రభావిత కుటుంబాలకు ఆర్థిక సాయం
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- తుఫాన్ సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష



అమలాపురం (చైతన్యరథం): మొంథా తుఫాన్ ముందుగా ఊహించినంత తీవ్రత కనబరచకపోయినా విద్యుత్ సరఫరా, రహదారి రవాణా వ్యవస్థలకు ఇబ్బందులు కలిగించిందని వ్యవసా య మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి తుఫాన్ సహాయక చర్యలపై సమీక్షించారు. తుఫాన్ ఈదు రుగాలుల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సుమారు 300 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, వాటి పునరుద్ధరణ పనుల్లో 80 శాతం పూర్తి అయిందని, మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ఎంఈడీ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్‌స్టేషన్లు తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయని, ముఖ్యమం త్రి చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాలని సూచించినట్లు చెప్పారు. ఆ దిశగా వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 134 కిలోమీటర్ల మేర రహదారులపై కూలిన వృక్షాలను తొలగించి రాకపోకలను పూర్తిగా పునరుద్ధరించామని, నేటి నుంచి ఆర్టీసీ బస్సులు నూటికి నూరు శాతం రాకపోకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలలో వారిని బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పించి రాత్రి భోజనం అనంతరం స్వగృహాలకు పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపా రు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతి కుటుంబానికి రూ.3,000, ఒంటరి వ్యక్తులకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని వెంట నే అందజేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, చేనేత కార్మికు లు తుఫాన్ ప్రభావంతో ఐదురోజులుగా ఉపాధి కోల్పోయి నందున వారికి 50 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. బియ్యం పంపిణీని రేషన్ డీలర్ల ద్వారా నేటి నుండే ప్రారంభించాలని జేసీ నిశాంతిని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల వరి పంట తుఫాన్ ప్రభావంతో నష్టపోయిందని, అలాగే ఉద్యాన పంటలైన అరటి తదితర పంటలు కూడా నష్టానికి గురైన ట్లు తెలిపారు. ఈ నష్టాలను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందా లు ఏర్పాటుచేసి పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడిం చారు. పంటల నష్టాలను తగ్గించేందుకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త ల సహకారంతో చర్యలు తీసుకుంటామని, ఆర్థిక సహాయం పారదర్శకంగా అందజేయాలని సూచించారు. బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకోవాలని ఆదేశించారు. మామిడికుదురు మండలంలో తుఫాన్ సమయంలో మరణించిన మహిళ కుటుం బానికి, పోస్ట్‌మార్టం అనంతరం రూ.5 లక్షల పరిహారం స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతులమీదుగా అందించాలని సూచించారు.

## వెలిగొండ టన్నెల్‌లో డీ వాటరింగ్ పనులు

- ఉత్తరాంధ్రలో వరదలపై అప్రమత్తం
- మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం



అమరావతి (చైతన్యరథం): ఇరిగేషన్ అడ్వైజర్, ఈఎన్‌సీ, సీఈలు, ఎస్ఈలతో మంత్రి నిమ్మల రామానాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆత్మకూరు, దోర్నాల ప్రాంతంలో భారీ వర్షాలతో వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్‌కు గండి పడి నీరు చేరింది. వెలిగొండ టన్నెల్ ఎగ్జిట్ ప్రాంతానికి నీరు రావడంతో 2 టన్నెల్స్ లోకి 9 కి.మీ మేర లోనికి నీరు ప్రవేశించింది. టన్నెల్‌లో పని చేస్తున్న 250 మంది కార్మికులను సురక్షిత ప్రాంతానికి తరలిం చాం. టన్నెల్‌లో డీ వాటరింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. గుండ్లకమ్మ పరీవాహక ప్రాంతం అధిక వర్షాలతో అవుట్ ఫ్లోను 70 వేల క్యూసెక్కుల నుంచి లక్ష క్యూసెక్కులకు విడుదల చేస్తూ వాటర్ మేనేజ్‌మెంట్ చేస్తున్నట్లు తెలిపారు. గుండ్లకమ్మ వరద నేపథ్యంలో ప్రకాశం, బాపట్ల కలెక్టర్లు దిగువ గ్రామాలలో అవసరమైన జాగ్రత చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఒడిశా రాష్ట్రంలోని వరదలను దృష్టిలో ఉంచుకుని ఉత్తరాం ధ్రలోని బహుదా పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చెరువులు, కాలువలకు గండ్లు పడిన చోట కలెక్టర్ల తో మాట్లాడి టిఆర్-27 కింద అత్యవసర అనుమతులు తీసుకుని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమతంగా ఉండాలని సూచించారు.

## బాధితులను ఆదుకుంటాం

- రైతులు, మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ బాసట
- విద్యుత్ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తున్నాం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మచిలీపట్నం/ బాపట్ల (చైతన్య రథం): మొంథా తుఫానుతో నష్టపోయిన బాధితులను అన్ని విధాలా అదు కుంటామని ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న మంత్రి గొట్టిపాటి బుధవారం కృష్ణా జిల్లా మచిలీపట్నం, బాపట్ల జిల్లా అడవిపల్లి పాలెం, పాండురంగాపురం గ్రామంతోపాటు అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా సహాయక శిబిరాలను సందర్శించి అక్కడి ప్రజల బాగోగులను విచారించారు. అనంతరం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కొల్లు రవీంద్రతో కలిపి మచిలీపట్నంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన., విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీట మునిగిన వరి, మిర్చి, వంగ తోటలను సహచర మంత్రి కొలుసు పార్థసారధి, స్థానిక ఎమ్మెల్యే నరేంద్రవర్మ రాజుతో కలిసి విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. తుఫానుతో పంటలు దెబ్బతిని నష్ట పోయిన రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. నష్టాలను అంచనా వేయించి అతి త్వరలోనే అందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తుఫాన్ వల్ల ప్రజలకు జరిగిన విద్యుత్ అంతరా యాన్ని సాయంత్రం లోగా పునరుద్ధరణ చేస్తామని ఆయన చెప్పారు. జిల్లాలో తుఫాను వల్ల 100 విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయాని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామ న్నారు. అదే విధంగా తుఫాను ప్రభావంతో వేటకు వెళ్లకుండా నష్ట పోయిన మత్స్యకార కుటుంబాలకు సహాయం చేస్తామన్నారు. మత్స్యకార కుటుంబాలతో పాటు సహాయ శిబిరాలలో ఉన్న వారికి కూడా ప్రభుత్వ పరంగా అందే బియ్యం, ఇతర సహాయాలను వెంటనే అందేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అద్దంకి గుండ్లకమ్మ నదిలో నీటిని విడుదల చేయడానికి ముగ్గురు సిబ్బంది ప్రాజెక్టు వద్దకు వెళ్లారని ప్రమాదవ శాత్తు గేట్లలో ఇరుక్కుపోయారని ఆయన చెప్పారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ముగ్గురు సిబ్బందిని గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్ల నుండి వారిని బయటికి తీసుకురావడానికి చర్యలు తీసుకుం టామని ఆయన చెప్పారు. ఎక్కడ కూడా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని మంత్రి చెప్పారు. బాపట్ల నియోజకవర్గంలోని పాండురంగాపురం, అడవిపల్లెపాలెం గ్రామంలో మంత్రులు రైతులతో మాట్లాడారు. పంటలు నష్టపోయిన వరి మరియు మిర్చి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్, వ్యవసాయ శాఖతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మన జాతి వైభవానికి ఆలయాలు మూలాధారం

- సుందరీకరణ పేరుతో ప్రాచీనత దెబ్బతినకూడదు
- పెద్దల వారసత్వ పరంపరను కొనసాగించాలి
- పునర్నిర్మాణంతో వేణుగోపాలస్వామి ఆలయ పూర్వవైభవం
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి
- దేవాదాయ మంత్రిగా ఆనం సంకల్పం గొప్పదని వ్యాఖ్య



నెల్లూరు (చైతన్యరథం): మన జాతి వైభవానికి ఆలయాలు మూలా ధారాలు.. పురాతన ఆలయాల ప్రాచీన చరిత్రను కాపాడు కోవడం మనందరి బాధ్యత అని పరమహంస, పరివ్రాజకా చార్యులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి పేర్కొన్నారు. బుధవారం ఉదయం నెల్లూరు మూలాపేట లోని రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవాన్ని ఆయన ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత హోమశాలలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నజీయరు స్వామి మాట్లాడుతూ చిత్తశుద్ధి, మంచి సంకల్పం ఉంటే భగవంతుడు మన వెంట ఉంటాడు అనేందుకు ఈరోజు జరిగిన ఈ గొప్ప కార్యక్రమమే ఉదాహరణ. తుఫాన్‌తో ఈ కార్యక్రమంపై అనేక సందేహాలు వచ్చాయని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంకల్పంతో కార్యక్రమాన్ని భగవంతుడు చేయించాడని చెప్పారు. చిత్తశుద్ధి, మంచి సంకల్పానికి అంత శక్తి ఉంటుందని భక్తులకు ఉపదేశించారు. భారతదేశం మొత్తం మీద తెలుగువారికి ఉన్న చరిత్ర మరెవ్వరికీ లేదు. తమిళనాడులోని శ్రీరంగం, మధురై పురాతన ఆలయాల్లో ఇప్పటికీ మన తెలుగులిపి కనిపిస్తుంది. మన చరిత్రను మనం సంరక్షించుకోవాలన్నారు. తెలుగువారి చరిత్రకు ఆల యాలే మూలాధామన్నారు. ఆలయాల సుందరీకరణ తప్పు కాదని, అయితే ఆలయాల ప్రాచీనత దెబ్బ తినకూడదన్నారు. ఆలయాల చరిత్ర కనుమ రుగు కాకుండా ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పురాతన శిలాశాసనాలు, శిలాఫలకాలు, వస్తుసామగ్రిని అలాగే ఉంచి మన చరిత్రకు సాక్ష్యాలుగా రేపటి తరాలకు అందించా లని కోరారు. పూర్వీకులు మనకు అందించిన వేల సంవత్సరాల చరిత్ర పరంపరను కొనసాగిస్తూ ఆలయాలకు వైభవం తీసుకురావాలని సూచించారు. వేణుగోపాలస్వామి ఆలయానికి గత పూర్వవైభవం తీసుకొచ్చేందకు మంత్రి ఆనం కృషి చేస్తున్నారని, భక్తులు భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు.

### 18 నెలల్లోనే ఆలయ నిర్మాణం పూర్తి: ఆనం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంతో చరిత్ర, ప్రాశస్త్యం కలిగిన వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మా ణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం 17కోట్ల నిధులను మంజూరుచేసినట్లు చెప్పారు. ఆలయ పవిత్రత దెబ్బతి నకుండా ఖర్చుకు వెనకాడకుండా ఆలయ గర్భాలయం, అంతరా లయం, రాజగోపురం, అన్వేటి మండపం నిర్మాణాలను రాతి కట్టడాలతోనే నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఆలయాల పునర్నిర్మాణాలను రాతికట్టడాలతోనే నిర్మిస్తామని, ఇందుకు వేణుగోపాలస్వామి ఆలయం నుంచే శ్రీకారం చుడుతున్న ట్లు మంత్రి చెప్పారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచే దళితుల ప్రవేశం జరిగిందన్న మంత్రి, ఆనాటి జ్ఞాపకాలను, ఆలయంలో ఉన్న పురాతన శిలాఫలకాలను సముచిత గౌరవంతో తిరిగి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐదుగురు సభ్యులతో ట్రస్టు బోర్డు ఉండాల్సి ఉండగా, ఒక స్థానంగా ఖాళీగా ఉండడంతో ఆనం వివేకానందరెడ్డి పెద్దకుమారుడు ఆనం చెంచుసుబ్బారెడ్డి ట్రస్ట్ సభ్యుడుగా నేడు ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించినట్లు మంత్రి చెప్పారు. ఆలయ నిర్మాణానికి రెండేళ్లు కాలం ఉన్నప్పటికీ 18 నెలల్లోనే అద్భుతంగా నిర్మాణాలను పూర్తి చేసి ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణం పూర్తయిన వెంటనే మహాకుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను కూడా చిన్నజీయరు స్వామి వారి స్వహస్తాలతో నిర్వహిస్తామని చెప్పారు. తొలుత వేణుగో పాలస్వామి ఆలయ విశిష్టతపై రూపొందించిన పుస్తకాన్ని చిన్న జీయర్ స్వామి ఆవిష్కరించారు.

# తుది దశకు రైతులకు ప్లాట్లు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

- కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారు
- ఇంకా 2501 మందికి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది
- నాలుగు నెలల్లో మొత్తం పూర్తి చేసేలా చర్యలు
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

అమరావతి (చైతన్యరథం): రాజధాని రైతులకు ప్లాట్ల కేటా యింపు, రిజిస్ట్రేషన్లపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి పొంగూరు నారాయణ మండిపడ్డా రు. రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ గందర గోళానికి గురిచేస్తున్నారన్నారు. రాబోయే నాలుగు నెలల్లో రైతుల కు కేటాయించాల్సిన ప్లాట్‌లతో పాటు రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. అమరావతి విషయంలో పక్కా ప్రణా ళికతో ముందుకెళుతున్నామని అన్నారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, 2014-19 మధ్య కాలంలో, కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురించి లెక్కలతో సహా మీడియా ముందు వివరించారు. అమరావతి కోసం భూసమీకరణ కింద మొత్తం 30,635 మంది రైతుల నుంచి 34,911.23 ఎకరాలను సీఆర్డీఏ ద్వారా తీసుకోవా లని నిర్ణయించామన్నారు. వీటిలో ఇప్పటివరకూ 29,644 మంది రైతులకు సంబంధించిన 34,192.19 ఎకరాలకు ప్లాట్ల కేటా యింపు



పూర్తయిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే 26,197 మంది రైతులకు సంబంధించిన 31,003.38 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తి కాగా.. కూటమి ప్రభుత్వం వచ్చిన ఇప్పటివర కూ 2727 మంది రైతులకు సంబంధించిన 3188.81 ఎకరాల కు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని తెలిపారు. ఇంకా 991 మంది రైతులకు సంబంధించిన 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు. వీటిలో ఉండవల్లిలో లేఅవుట్ ఫైనల్ కాకపోవడం, లంక భూములు, కోర్టు కేసులు, పీఓటీ కేసులు, 12 సెంట్ల లోపు ఉన్న భూములు ఉన్నాయని తెలిపారు. ఇక రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా వేగంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకూ 26,732 మంది రైతులకు 60,980 ప్లాట్లు రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలి పారు. ఇంకా 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. వీటిలో కోర్టు కేసులున్నవి 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు, ల్యాండ్ అక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందిన 1170 ప్లాట్లు, వివాదాల్లో 450 మందికి చెందిన 1889 ప్లాట్లు, పీఓటీ కుసుల్లో 78 మంది రైతులకు చెందిన 208 మంది ప్లాట్లు, దేవదాయ శాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందిన 69 ప్లాట్లు, లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందిన 337 ప్లాట్లు, ఎన్‌ఆర్ ఐలు 210 మందికి చెందిన 444 ప్లాట్లు ఉన్నాయి. ఆయా పెండింగ్ ప్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేసేలా ముందుకెళుతున్నామని చెప్పారు. ప్రస్తుతం రోజుకు 60 నుంచి 90 ప్లాట్ల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా యని వివరించారు. అలాగే రైతులకు చెల్లించే కౌలు నగదుపైనా మంత్రి స్పష్టత ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 231.03 కోట్ల నగదు చెల్లించగా మరో 484 మంది రైతులకు 3.15 కోట్లు వివిధ సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అలాగే గత రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 319 మంది రైతులకు 1.03 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పా రు. కోర్టు కేసులతో పాటు చనిపోయిన వారికి సంబంధించిన వివాదాలతో పెండింగ్ ఉన్నట్లు స్పష్టం చేశారు.

# తుఫాన్ నష్ట నివారణ చర్యలు ప్రారంభించాలి

**అన్ని గ్రామాల్లో పరిస్థితులను చక్కదిద్దండి: దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



నెల్లూరు(చైతన్యరథం): తుఫాన్ అనంతరం తీసుకోవలసిన చర్యలపై ఆత్మకూరు నియోజకవర్గ అధికారులతో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా పంచాయతీ అధికారులు శానిటేషన్ కార్యక్రమాలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడి కలిగిన విద్యుత్ అంతరా యాన్ని వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల వద్ద పోలీసు సిబ్బందిని నియమించి ఎవరు కూడా అటు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపా రు. డ్రోన్ విజువల్స్ తీసి బ్లాక్ అయిన రోడ్లను గుర్తించి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి. ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు అన్ని పీహెచ్‌సీలలో వైద్యులు అందుబా టులో ఉండాలి. ఎక్కడైనా తాగునీరు కలుషితమైతే ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలి. పోలీసు, రెవె న్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి తుఫాన్ అనంతర నష్ట నివారణ చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

# పంట నష్టం వివరాలు అందజేయాలి

- గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి
- బాపట్ల జిల్లాలో ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- పంటపొలాలు, పునరావాస కేంద్రాల పరిశీలన

బాపట్ల (చైతన్యరథం): వేమూరు నియోజకవర్గం, వేమూరు మండలం జంపని, కొల్లూరులో మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించారు. మొంథా తుఫాను నేపథ్యంలో జంపని గ్రామంలోని హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, తీవ్ర గాలులకు నేలకొరిగిన పంట పొలాలను స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబుతో కలిసి పరిశీలించారు. పునరావాస కేంద్రంలో ప్రజలకు అందుతున్న సదుపాయాలపై అధికారులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై అధికారులు పారదర్శకంగా అం చనాలు వేసి ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన పంట నష్టానికి సంబంధించిన వివరాలను అధికా రులు మంత్రికి



వివరించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలను అధికారులు చేపట్టాలని సూచించారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**- మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



పార్వతీపురం మన్యం (చైతన్యరథం): మొంథా తుఫాన్ దృష్ట్యా సాలూరు, పట్టణ మండల అధికారులతో గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి నదీ తీరప్రాంతంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశిం చారు. బియ్యం ఎవరికి కావాలన్నా ఇవ్వండి.. అవసరమైతే సొంత నిధులిస్తా..పేదల ఆకలి తీర్చాలని సూచించారు. పంట నష్టపో యిన రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తాం.. రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ధైర్యం చెప్పి మంచి భోజనం అందించాలని సూచిం చారు. వైటీసీ భవనంలో ఉన్న గర్భిణులకు వైద్యం, పౌష్టికాహారం సరైన సమయంలో అందించాలని, తుఫాను కష్టం తీరే వరకు అధికారులు అంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

# యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

- విద్యుత్ సీఎండీతో మంత్రి గొట్టిపాటి సమీక్ష
- విద్యుత్ పునరుద్ధరణకు తక్షణ ఆదేశాలు
- విద్యుత్ సమస్య తలెత్తిన ప్రాంతాలపై ఆరా



అమరావతి (చైతన్య రథం): విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, సీఎండీతో ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. మొంథా తుపాను తీరందాటిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సమస్యలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సమస్యపై మంత్రి గొట్టిపాటి ఆరా తీశారు. తుపాను ధాటికి గాలులు వేగంగా వీయడంతో కొన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేసినట్టు అధికారుల మంత్రికి వివరించారు. పోల్ టూ పోల్ పెట్రోలింగ్ చేస్తూ సమస్యలేని చోట విద్యుత్ పునరుద్ధరణ చేయాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఇప్పటికే ఎస్పీడీసీఎల్‌నుంచి తీసుకొచ్చిన అదనపు సిబ్బందితో క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ ఉద్యోగులంతా పునరుద్ధరణ చర్యల్లో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను అరికట్టేలా చూడాలని కోరారు. అయితే ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వర్షం పడుతున్న కారణంగా పునరుద్ధరణకు సమయం పడుతుందని అధికారులు మంత్రి గొట్టిపాటికి వివరించారు.

### విద్యుత్ పునరుద్ధరణ పనులపై మంత్రి గొట్టిపాటికి లోకేశ్ ఫోన్

ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి నారా లోకేశ్ ఫోన్ చేసి.. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. విద్యుత్ సమస్యపై మంత్రి గొట్టిపాటితో మాట్లాడారు. బుధవారం సాయంత్రంనాటికి వంద శాతం విద్యుత్ పునరుద్ధరణ పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. కొన్నిచోట్ల ప్రమాదాల నివారణకు విద్యుత్ నిలిపివేసినట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు, సీఎండీ కూడా క్షేత్రస్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైనట్లు లోకేశ్‌కు వివరించారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని నారా లోకేశ్ సూచించారు.

# నష్టపోయిన ప్రతిఒక్కరికీ అండగా ఉంటాం

- గాలులతో విద్యుత్ అంతరాయం కలిగింది
- 24 గంటల్లోనే విద్యుత్ పునరుద్ధరణ
- మత్స్యకారులకు 50 కిలోల బియ్యం
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

మచిలీపట్నం (చైతన్యరథం): మొంథా తుపానుతో నష్టపోయి న ప్రతిఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర భరోసా ఇచ్చారు. తెల్లవారు జాము నుంచే తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితుల్ని చక్కదిద్దారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికు మార్‌తో కలిసి విద్యుత్ లైన్ల మరమ్మతులను పరిశీలించారు. సర్కారువారి తోట ప్రాంతంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించారు. మేకవా రిపాలెంలో చెట్టు విరిగి ఇంటిపై పడడంతో గాయాలపాలై కొల్లు వీరబాబు కుటుం బసభ్యులను పరామర్శించారు. వారికి నష్టపరిహారం అందిస్తామ ని భరోసా ఇచ్చారు. మచిలీపట్నం ఇంజనీ రింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడి ప్రజలకు అందిస్తున్న భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. 13వ డివిజన్ లోని బీసీ బాలికల వసతిగృహం వద్ద విరిగిపోయిన చెట్టును దగ్గరుండి తొలగించారు. రూరల్ మండలం చిన్నాపురం గ్రామంలో టీ దుకాణంలో స్వయంగా టీ పెట్టి, స్థానికంగా కూరగాయలు అమ్ముకునే రైతులను పరామర్శించారు. పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. రూరల్ మండలం సింహాచలం,



ఎన్.గొల్లపాలెం, వెంకట దుర్గమ్మపురంలో రైతులను కలిసి పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తుపాను ప్రభావంతో మచిలీపట్నం లో సుమారు 90 కి.మీ వేగంతో గాలులు వీచాయని, వందలా దిగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ అధికారులు, మంత్రులు, ప్రజాప్రతి నిధులు అప్రమత్తం చేయడం వలనే ప్రాణనష్టం నివారించ గలిగామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగినప్పటికీ సరఫరా పునరుద్ధరణలో విద్యుత్ శాఖ తీసుకున్న చర్యలు అభినందనీయం. 24 గంటల్లోనే విద్యు త్ సరఫరా మొత్తాన్ని పునరుద్ధరించడం హర్షణీయం. పునరా వాస కేంద్రాల్లో ఉన్న వారికి ఆహారం, మందులు సరిపడా అందించడంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర అభినందనీయం. అవసరమైన వారు ఇప్పుడే రేషన్ షాపుల్లో సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించాం. ఒకప్పుడు తుపాను వస్తే ఎక్కడ తీరం దాటుతుందో తెలియని పరిస్థితి ఉండేదని, కానీ నేడు.. కచ్చితమైన సమాచారంతో తుపాను రాకను పసిగట్టి పటిష్టమైన చర్యలు తీసుకున్నాం. కలెక్టరేట్లు, తహశీల్దార్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పా టు చేశారు. వేట నష్టపోయిన మత్స్యకారులకు 50 కిలోల వరకు బియ్యం అందించాలని నిర్ణయించడం అభినందనీయం. రోడ్లపై గుంతలు పూడ్చడం కోసం ఆదేశాలిచ్చారు. మరోవైపు నష్టపరిహారం అంచనా వేయడం కోసం కూడా బృందాలను క్షేత్రస్థాయికి పంపించడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనం. ఇంత పెద్ద తుపాను నుండి బయట పడేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ మంత్రి కొల్లు రవీంద్ర అభినందనలు తెలిపారు.

### విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ మచిలీపట్నం లో వర్షం తక్కువగా ఉన్నప్పటికీ గాలులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సరఫరాను ముందుగానే నిలిపివేశాం. అధికారులను అప్రమత్తం చేసి వీలైనంత వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. గుడివాడ, వుయ్యూరు, మచిలీపట్నం నియోజకవర్గాల్లో సుమారు 52 సబ్‌స్టేషన్లకు సరఫరా నిలిచిపోయింది. 471 వరకు 11 కేవీ ఫీడర్లు దెబ్బతి న్నాయి. కృష్ణా జిల్లాలో 98, అవనిగడ్డలో మరో 38 స్తంభాలు కూలిపోయాయి. వాటిని కూడా పునరుద్ధరించాం. విపరీతమైన గాలుల కారణంగా పునరుద్ధరణ పనులు ఆలస్యమయ్యాయి. తుపాను తీరం దాటిన ప్రాంతాల్లో కూడా వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

# తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

- ముందస్తు అప్రమత్తతతో ప్రాణ నష్టం నివారించగలిగాం
- పంట నష్టం అంచనా వేసి రైతులకు న్యాయం చేస్తాం
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి
- ఒంగోలులో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

ఒంగోలు (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు, అధికార యంత్రాంగం అప్రమత్తత వల్ల తుఫాన్‌ని సమర్థ వంతంగా ఎదుర్కొన్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఒంగోలు నగరంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ఆయన పర్యటించారు. జవహర్ నవోదయ విద్యాలయం తరగతి గదులు, వంట రూములు నీట మునగడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతుండటంతో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.కె.రియాజ్, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన వెంకటరావు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తరువాత భాగ్య నగర్‌లోని గిరిజన సంక్షేమ బాలురవసతి గృహాన్ని మంత్రి సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అంతా కష్టపడటం వలన ప్రాణ ఆస్తి నష్టాన్ని నివారించడం జరిగిందన్నారు. తుఫాన్ సమయంలో ఇద్దరు



ముగ్గురు ను రిస్కు చేసి కాపాడటం జరిగిం దన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ట్యాంకులు నిండి ఉన్నాయని, ఎక్కడైనా ట్యాంక్ లు గండ్లు పడే పరిస్థితి ఉన్నప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. నిలిచిపోయిన వర్షం నీటిని క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా సమర్థవంతంగా పనిచేసిన జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో మొక్కజొన్న, పత్తి, శనగ, సజ్జ, మిర్చి పంటలకు నష్టం జరిగింది. పంట నష్టం అంచనాల నివేదికను కూడా తయారు చేయడం జరుగుతుందన్నారు. వర్షం నీరు తగ్గిన తర్వాత పంట నష్టాన్ని, ఇతర నష్టాలను పూర్తి స్థాయిలో అంచనా వేసి ప్రభుత్వ పరంగా అందే సహాయాన్ని బాధితులకు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# జిల్లాల పునర్వ్యవస్థీకరణపై మంత్రుల భేటీ

- నియోజకవర్గం మొత్తం ఒకే డివిజన్
- మరోసారి సమావేశమై సీఎంకు నివేదిక



అమరావతి (చైతన్యరథం): అమరావతి సచివాలయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం భేటీ అయింది. మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, నాదెండ్ల మనోహరర్, సత్య కుమార్, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజ నను సరిదిద్ద డంపై చర్చించారు. జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ హామీనిచ్చారు. ఆ హామీని నేరవేర్చే విధంగా జీవోఎం ఇచ్చిన నివే దికపై సీఎం చంద్రబాబు కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారు. వాటితో పాటు జీవోఎంలో ఉన్న మంత్రులు ఇచ్చిన సూచనలను కూడా కూలంకుషంగా చర్చించారు. మండలాలు, పంచా యతీలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని నిర్ణయించారు. మరోసారి సమావేశమై నివేదికను రూపొందించి సీఎంకు అందజేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జన గణనకు ముందే నివేదిక ఇస్తా మని చెప్పారు. సమయాన్ని కూడా పరిగణనలోని తీసుకుని అధ్యయనం చేస్తామని వివరించారు.

## తుఫాన్ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలు

అమరావతి (చైతన్యరథం): తుఫాన్ తరువాత తీసుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. వేడిచేసిన/క్లోరినేటెడ్ నీరు మాత్రమే తాగాలి. అధికారికంగా సమాచారం వచ్చేవరకు బయటకు వెళ్లవద్దు, మిమ్మల్ని షెల్టర్/ఆశ్రయంలో ఉంచినట్లయితే అధికారులు చెప్పే వరకు తిరిగి వెళ్లవద్దు. విరిగిన విద్యుత్ స్తంభాలు, వదులుగా ఉండే తీగలు /తెగిన తీగలు, ఇతర పదునైన వస్తువుల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి. దెబ్బతిన్న/పడిపోయిన భవనాల్లోకి ప్రవే శించవద్దు. దెబ్బతిన్న విద్యుత్ పరికరాలను/వస్తువులను వాడే ముందు వాటిని ఎలక్ట్రీషియన్ చేత తనిఖీ చేయించాలని సూచించింది.

# ముందస్తు చర్యలతో తుఫాన్ నష్ట నివారణ

- ఆర్టీజీఎస్ సలహాలు, ఆదేశాలతో సత్ఫలితాలు
- 99.1 శాతం విధుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




అమరావతి(చైతన్యరథం): ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకుని మొంథా విపత్తు నుంచి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు కాపాడారని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సుదీర్ఘ పరిపాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి కుటుంబ పెద్దగా తీసుకున్న చర్యల కారణంగానే ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని పేర్కొ న్నారు. ఆర్టీజీఎస్ ఇచ్చిన సూచనలు, ఆదేశాలు సత్ఫలితాలు ఇచ్చాయని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా జారీచేసిన ఎస్ఓపీ (ప్రామాణిక విధి విధానాలు) వల్ల వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తించారని, 99.1 శాతం వరకు విధుల్లో ఉన్నారని తెలిపారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబుతో ప్రధాని మోదీ స్వయంగా మాట్లాడడమే కాకుండా వివరాల సేకరణ కోసం పీఎం కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటరును ఏర్పాటు చేశారని తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా కూడా తనతో మాట్లాడారని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం భరోసా ఇచ్చిందని తెలిపారు.

### అప్రమత్తంగా వ్యవహరించిన వైద్య ఆరోగ్య శాఖ

ప్రసవానికి దగ్గర్లో ఉన్న సుమారు 2,500 మంది గర్భిణులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించామని తెలిపారు. పునరా వాస కేంద్రాల్లో ప్రత్యేకంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులు ఉండే ప్రాంతాల్లో బోటు క్లినిక్‌లను సైతం ఏర్పాటుచేశామని తెలిపారు. అత్యవసర (108), 104 (సంచార వైద్యం) కొన్ని అంబులెన్సులను సహాయక చర్యల నిమిత్తం ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు తెలిపారు. 588 అత్యవసర కాల్స్‌కు తగ్గట్లు చర్యలు తీసుకున్నామన్నారు. ఇకపై తుపాను ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. కాచి వడబోసిన నీటినే తాగాలి. మరో 4 రోజుల పాటు ప్రజలు కాస్త జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# పొంగిపొర్లుతున్న బహుదా నది... తుపానుతో ఇద్దరు మృతి

శ్రీకాకుళం (చైతన్యరథం): మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఇచ్ఛాపురం జలదిగ్బంధంలో ఉండిపోయింది. ఒడిశాలోని భగలట్టి డ్యాం గేట్లు ఎత్తివేయటంతో బాహుదా నదికి వరద పోటెత్తడంతో ఉగ్రరూపం దాల్చింది. ప్రస్తుత ప్రవాహం 51,228 క్యూసెక్కుగా ఉంది. ఇక భారీ వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ వరద కారణంగా ఇచ్ఛాపురంలోని పాత వంతెన వద్ద నిర్మించిన శివాలయం నీటమునిగింది. అలాగే పాత శాసనం, జగన్నాధపురం, ఇన్నేసుపేట, ఈదుపురం, బూర్జపాడు, డొంకూరు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలకు అధికారులు పలు హెచ్చరికలు జారీ చేశారు. అవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు రావొద్దని సూచించారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగుల వద్దకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

**తుపాను వల్ల రాష్ట్రంలో ఇద్దరు మృతి**

మొంథా తుపాను వల్ల జరిగిన నష్టం అంచనా ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. తుపాను వల్ల రాష్ట్రంలో ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. ప్రాథమిక అంచనా నివేదికను రెండ్రోజుల్లో అధికారులు ప్రభుత్వానికి నివేదించే అవకాశం ఉంది. అంచనాలు వచ్చాకే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించనుంది. 249 మండలాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుపాను ప్రభావం ఉన్నట్టు తెలుస్తోంది. పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో ఈదురు గాలులకు చాలా చోట్ల కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది.

# విపత్తు వేళ ప్రాణాలు కాపాడుతున్న డ్రోన్లు



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొంథా తుఫాను అతలాకుతలం చేసింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. ఎంతో మంది వరద నీటిలో చిక్కుకున్నారు. వారి కోసం ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంతేకాదు మొంథా తుఫాను సహాయక చర్యల్లో భాగంగా పరిస్థితి అంచనా వేసేందుకు ప్రభుత్వం డ్రోన్లను కూడా వినియోగిస్తోంది. టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డ్రోన్ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతోన్న వ్యక్తిని అధికారులు డ్రోన్ ద్వారా గుర్తించారు. అధికారులు వెంటనే అలెర్ట్ కావడంతో వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని పోలీసులు కాపాడారు. అంతేకాదు వరదలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాలను డ్రోన్ల సాయంతో పర్యవేక్షిస్తున్నారు. కొన్ని చోట్ల కొట్టుకుపోతున్న పశువులను డ్రోన్ల ద్వారా గుర్తించి ఒడ్డుకు చేర్చారు. డ్రోన్ల ద్వారా ప్రమాదకర పరిస్థితులను గుర్తించి అధికారులు వెంటనే అలెర్ట్ అవుతున్నారు. ఏపీ ప్రభుత్వం డ్రోన్లను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల ఇటీవల ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్‌ను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. డ్రోన్ మార్ట్ ద్వారా వ్యవసాయం సహా వివిధ రంగాల్లో డ్రోన్ల ద్వారా సేవలు పొందేందుకు పోర్టల్‌ను ఏపీ డ్రోన్ కార్పోరేషన్ రూపొందించింది. ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ద్వారా వ్యవసాయం, ఇన్ఫ్రా, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చు. డ్రోన్ మార్ట్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుత విపత్తు సమయంలోనూ డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

# రైతుల కోసం అండగా నిలిచిన కూటమి ప్రభుత్వం

**• నష్టపరిహారం చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన మాజీమంత్రి కిడారి**



అల్లూరి సీతారామరాజు (చైతన్యరథం): హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీ పరిధిలోని మాసాడ గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించడానికి రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్, మాజీ మంత్రి, అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ భారీ వర్షాన్ని లెక్కచేయకుండా గ్రామానికి చేరుకుని, వరదలో కొట్టుకుపోయిన పంట పొలాలను సందర్శించారు. తదనంతరం పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం హుకుంపేట నుండి చీడిపుట్టు మార్గంలోని అడ్డుమండ బ్రిడ్జిపై నుండి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... "మొంథా తుఫాన్ కారణంగా ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. అయితే పంట నష్టం జరిగిన రైతులు ఇబ్బంది పడకుండా తక్షణ నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకోసం సంబంధిత అధికారులు వెంటనే నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి నివేదికను ప్రభుత్వానికి పంపాలి," అని ఆదేశించారు.

# వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించిన ప్రభుత్వ విప్



కురుపాం (చైతన్యరథం): మొంథా తుపాను నేపథ్యంలో నియోజకవర్గం జియ్యమ్మవలస మండలంలో ఉన్న వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి పరిశీలించారు. మొంథా తుఫాన్ వలన భారీ వర్షాలు కురవడం వలన రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో నీటిని జలాశయం నుండి బయటకు విడుదల చేశారు. నీటిని విడుదల చేయడం వలన కురుపాం నుండి తూర్పు ముఠాకి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టుపై నుండి నీరు వెళ్లడం వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. తూర్పు ముఠా ప్రజలు నీటి ప్రవాహం తగ్గేవరకు ఈ మార్గంలో ప్రయాణించవద్దని సూచించారు. ఎమ్మెల్యే వెంట జియ్యమ్మవలస కన్వీనర్ జోగి భుజంగరావు, పిఏసిఎస్ చైర్మన్ సోముల మాస్టర్, దాసరి రామారావు, జి ఎల్ పురం కన్వీనర్ అడ్డాకుల నరేష్, బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, మాజీ ఎంపీటీసీ సభ్యులు మండంగి ప్రసాద్ రావు, రామారావు, బాలు, జలాశయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సమర్థవంతంగా తుపాను సహాయ పునరావాస చర్యలు చేపట్టాం

**●ప్రాణ నష్టం,ఆస్తి నష్టం లేకుండా చూడగలిగాం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి**





రాజమహేంద్రవరం (చైతన్యరథం): మొంథా తుపాను వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహాయ పునరావాస చర్యలు సకాలంలో చేపట్టడంతో పాటు ప్రాణ నష్టం ఆస్తి నష్టం లేకుండా చూడగలిగామని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. దీని కోసం గత 36 గంటలుగా తనతోపాటు కష్టపడి తిరుగుతున్న టీడీపీ జనసేన బీజేపీ కూటమి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియచేస్తున్నామని, అలాగే సమన్వయంతో పనిచేసి ఎప్పటికప్పుడు సహాయ చర్యలు చేపట్టిన అన్ని శాఖల అధికార యంత్రాంగానికి ఆయన అభినందనలు తెలిపారు. బుధవారం కోటిలింగాలపేటలోని 100 మత్స్యకార కుటుంబాలకు భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పది కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పంచదార, లీటర్ పామాయిల్ ప్యాకెట్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తుపాను తాకిడికి నగరంలో కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చేయగలిగామని చెప్పారు.ఎంతో దూరదృష్టితో, అవగాహనతో కూటమి నాయకులు సమర్థవంతంగా పని చేశారని చెప్పారు. తాను సుమారు 10 గంటలపాటు కమాండ్ కంట్రోలు రూములో ఉండి పరిస్థితిని పర్యవేక్షించినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు.అధికారులు పది టీములుగా ఎంతో సమన్వయంతో పని చేశారని కొనియాడారు. ఎక్కడా ప్రజలు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయగలిగామని ఆయన అన్నారు. తాము ఇంత కష్టపడి పని చేస్తుంటే వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, రాజమండ్రిలో ఒక చెట్టు ఊగడంలేదని, ఆకు కదలడం లేదని ఇక్కడ తుపాను ప్రభావం లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆయన మండిపడ్డారు.

2021 నవంబరు 19న తుపాను వస్తే అప్పుడు నాటి సీఎం జగన్, జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా తడిగుడ్డ వేసుకుని ఇంట్లో పడుకున్నారని దాంతో కడప జిల్లాలోని అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకు పోయిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గుర్తు చేశారు. అలాంటి నాయకుడు నడిపే పార్టీలో ముందు చూపులేని ఇలాంటి చిల్లర చేష్టలు చేసే నాయకులు ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతన్న

**● ప్రతి రైతును ఆదుకుంటాం : ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**



అనపర్తి (చైతన్యరథం): బిక్కవోలు మండలం పందలపాక, ఊలపల్లి, బలభద్రపురం గ్రామాలలో తడిచి మొలకెత్తిన వరి పంట పొలాలను నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. నీట మునిగిన వరిచేలను పరిశీలించి రైతులను ఓదార్చి వారికి కల్పించారు. రైతులకు నష్టపరిహారం ఇప్పించే విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మొంథా తుఫాన్ కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిన కారణంగా అధికార యంత్రాంగం సన్నద్ధం అవ్వడం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడగలిగాం గానీ, ముఖ్యంగా వరి రైతులు అయితే తీవ్రంగా నష్టపోయారు. వరి, మినుము రైతులు పూర్తిగా దెబ్బతిన్నారని, వరి పంట మరో 15 రోజుల్లో కోతలు ప్రారంభమౌతాయనే దశలో తుపాన్ ప్రభావంతో పంటంతా దెబ్బతినడం బాధాకరమన్నారు. తీవ్రమైన తుపాను వచ్చినా ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణం నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిక్కవోలు మండలం కూటమి నాయకులు, పందలపాక, ఊలపల్లి, బలభద్రపురం గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మడ్డువలస జలాశయానికి భారీగా వరద నీరు

**● ఏడు ప్రధాన గేట్ల ద్వారా దిగువకు విడుదల**

వంగర (చైతన్యరథం): విజయనగరం జిల్లా వంగర మండలం మడ్డువలస జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. బుధవారం సాయంత్రానికి జలాశయంలోకి సువర్ణముఖి. వేగావతి నదులు ద్వారా 24,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని జలాశయం డీఈ అర్జున్ తెలిపారు. నీటిమట్టం పెరిగే అవకాశం ఉండడంతో 7 ప్రధాన గేట్ల ద్వారా 21,600 క్యూసెక్కుల నీటిని దిగువన నాగావళి నదిలోకి విడుదల చేస్తున్నారు. జిల్లాలోని తెర్లాం మండలం ఆమిటిలో కరణం తిరుపతికి చెందిన పెంకుటిల్లు గోడ కూలిపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

# తుపాను బాధితులకు అండగా నిలిచిన ఎంపీ సానా సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం



మరోవైపు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి భోజనం, మంచినీరు, మందులు సరఫరా చేశారు. తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని ప్రజలంతా సురక్షితంగా ఉండాలని

కాకినాడ (చైతన్యరథం): కాకినాడలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛందంగా సహాయక చర్యలను అందించేందుకు, బాధితులకు అండగా నిలిచేందుకు రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కృషి చేస్తుంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు కావాల్సిన అవసరాలను అడిగి తెలుసుకుంటున్నారు. కాకినాడ ప్రాంతంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేస్తున్నారు.

బృందం సభ్యులు కోరారు. విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవుని దయతో స్వల్ప నష్టంతో బయటపడ్డాం

**●తుపాను పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ**

**●పునరావాస బాధితుల్ని పరామర్శించిన మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు**



పెదపాడు (చైతన్యరథం): పెదపాడు మండలం హనుమాన్ జంక్షన్ – ఏపూరు గ్రామం యంపిపి ప్రాథమిక పాఠశాలలో బుధవారం పునరావాస కేంద్రాన్ని సందర్శించి, బాధిత కుటుంబాలను కలసి, ఇప్పటివరకు అందుకున్న సౌకర్యాలు అడిగి తెలుసుకుని, బియ్యం, నిత్యవసర సరుకులు, నగదు పంపిణీని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు సంయుక్తంగా పాల్గొని బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముంపుబారిన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి సకల సౌకర్యాలు కల్పించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవం సూచనలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు, సమీక్షలు చేస్తూ అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారని అన్నారు. అందరూ ప్రార్థనలు ఫలించి, దేవుని దయతో స్వల్ప నష్టంతో తుఫాన్ నుండి బయటపడ్డామని అన్నారు.ఈ నాలుగు రోజులు అనుభవాలు భవిష్యత్తులో మనకు ఎంతోగానో ఉపయోగపడతాయని అన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ మాశాఖ తరపున రాష్ట్రవ్యాప్తంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం సూచనలు, సలహాలు పాటించాలని, పుకార్లు, వదంతులు నమ్మవద్దని ఈ సందర్భంగా ప్రజలకు, రైతులకు ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు.

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయుక్తంగా తీసుకున్న సహాయక చర్యలు, తగు జాగ్రత్తలు మా నియోజకవర్గంలో పునరావాస కేంద్రాలు, సహాయక కార్యక్రమాల్లో పాల్గొనుటకు మాకు ఎంతగానో స్ఫూర్తి కలిగి 20 గంటలు పైగా పనిచేసి, విజయవంతంగా కార్యక్రమాలు చేసుకున్నామని అన్నారు. శివారు ప్రాంతాల్లో డేరాలు కట్టుకుని, రేకుల షెడ్లు, పూరిపాకల్లో నివసిస్తున్న 32 కుటుంబాలు 96 మందిని యంపిపి ప్రాథమిక పాఠశాలలో తరలించి భోజన వసతి సౌకర్యాలు కల్పించమన్నారు. ముందుచూపుతో జిల్లాలో ఉంగుటూరు, కైకలూరు, దెందులూరు నియోజకవర్గాలలో ఇంచార్చి మంత్రి, జిల్లా కలెక్టరు ఫోకస్ పెట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విజయవంతం అయ్యామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులు, నగదు పంపిణీ తొలి కార్యక్రమం నా నియోజకవర్గంలో జరుగుట నాకు ఎంతో సంతృప్తిని, సంతోషం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం. అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధైర్యంగా ఉండండి అండగా ఉంటాం : మంత్రి పార్థసారిథి



బాపట్ల (చైతన్యరథం): నియోజకవర్గంలోని, అడివిపల్లిపాలెం గ్రామంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించారు. మొంథా తుఫాను నేపథ్యంలో అడివిపల్లిపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని స్థానిక శాసనసభ్యులు వేగేశ్న నరేంద్రవర్మతో కలిసి పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని ప్రజలతో మంత్రి ముచ్చటించారు. ప్రజలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలంతా పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉండాలని కోరారు. గ్రామంలో మంత్రి పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చోటు చేసుకున్న నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని స్థానిక అధికారులను మంత్రి ఆదేశించారు.

# పంటనష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే కుమార్ రాజా

**● ప్రభుత్వపరంగా సాయమందిస్తాం : వీరంకి గురుమూర్తి**



పామర్రు (చైతన్యరథం): మొంథా తుపాను తీవ్ర నష్టాల్ని మిగిల్చిందని, ముఖ్యంగా అన్నదాతలు బాగా నష్టపోయారని, మరో పది .. పదిహేను రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో మొంథా తుఫాను పెనువిపత్తును సృష్టించిందని, దీంతో అన్నదాత లు కోలుకోలేని నష్టాల్ని చవిచూడాల్సి వచ్చిందని, అన్నదాతలు ఎవరూ అధైర్యపడవద్దని ప్రభుత్వం నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ జా భరోసా ఇచ్చారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే కుమార్ రాజా గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తితో కలిసి పరిశీలించారు. మండల కేంద్రం తోట్లవల్లూరు, బొడ్డపాడు గ్రామాల్లో తుఫాను ప్రభావానికి గురైన వరిపంటలను పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులతో మాట్లాడి వారిలో ధైర్యం నింపారు. భోజనం ఎలా ఉందని బాధితులను అడిగి తెలుసుకున్నారు. వారు భోజనం, సదుపాయాలపట్ల సంతృప్తివ్యక్తం చేయగా తాను కూడా శిబిరంలోనే భోజనంచేశానని ఎమ్మెల్యే రాజా ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొంథా తుఫాను పెనువిపత్తు బాధాకరమన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే ద్వారా జరిగిన నష్టాన్ని పరిశీలిస్తున్నారన్నారు. పంట సాగు సమయంలో రైతులు పూర్తిస్థాయిలో మందులు అందించి ఆదుకున్నామని, అయితే, మొంథా రైతుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. అయినా, ఎవరూ అధైర్యపడవద్దని, తోట్లవల్లూరు మండలంలో వరితోపాటు ఇతర వాణిజ్య పంటలకు జరిగిన నష్టాన్ని అధికారుల బృందాలు అంచనా వేస్తాయని, నష్టం వివరాలను సీఎం చంద్రబాబుతోపాటు సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిరాటంకంగా కొనసాగిస్తోందన్నారు.

గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి మాట్లాడుతూ... తుఫానులను ఎదుర్కోవటంతో సీఎం చంద్రబాబుకు మరెవరూ సాటిరారన్నారు. 20 రోజులుగా తుఫాను పట్ల ప్రజలను, అధికార యంత్రాంగాన్ని, పాలకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వచ్చారని, టెక్నాలజీని ఉపయోగించి మొంథా తుఫానును ధీటుగా ఎదుర్కొన్నామని, సాధ్యమైనంత వరకు ప్రాణనష్టాన్ని పూర్తిగా నివారించగలిగామన్నారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కుమార్ రాజాల సూచనలు, సలహాలతో నియోజకవర్గంలో తుఫాను ప్రభావిత ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. తోట్లవల్లూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోను వరి, వాణిజ్య పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని, అయినా, ఎవరూ ఆందోళన చెందవద్దని, తుఫాను ప్రభావం తగ్గిన తరువాత అధికారులు పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తారని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా సాయమందిస్తామన్నారు.

# ఒకే రాజధాని... అభివృద్ధి వికేంద్రీకరణ... ఇదే కూటమి ప్రభుత్వ విధానం

**●రాష్టానికి రండి... పెట్టుబడులు పెట్టండి... అభివృద్ధిలో భాగస్వాములుకండి**

**●అమెరికా న్యూజెర్సీలో సందడిగా సాగిన మీట్ విత్ మన్నవ మోహనకృష్ణ ప్రత్యేక కార్యక్రమం**



గుంటూరు / నూజెర్సీ (చైతన్యరథం): మాతృభూమి మీద మమకారంతో రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు కీలక పాత్ర పోషించాలని, సృజనాత్మక ఆలోచనలతో తమ స్వగ్రామాల్లో సూక్ష్మ, మధ్య తరహా, భారీ పరిశ్రములు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎన్ఆర్ఐలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఎన్ఆర్ఐలకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా గత ఆదివారం న్యూజెర్సీలో ప్రవాసాంధ్రులు ఏర్పాటు చేసిన 'మీట్ విత్ మన్నవ మోహనకృష్ణ' ప్రత్యేక ఆత్మయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్రాభివృద్ధిలో ఎన్ఆర్ఐల అందించాల్సిన సహకారం తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం మోహనకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మాతృభూమితో నిరంతరం సంబధాలను కొనసాగిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు ప్రజలు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలనే ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయానికి ప్రతి ప్రవాసాంధ్రుడు కృషి చేయాలన్నారు. ఏపీలో ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను తయారుచేసి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని, కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుంటూ సాంకేతికత ద్వారా పాలన అందించేలా వాట్సప్ ద్వారా 730కి పైగా పౌరసేవలను రాష్ట్రం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని మోహనకృష్ణ తెలిపారు. గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి వచ్చాయని, ఒక రాష్ట్రం... ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ... కూటమి ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. జోన్ల వారీగా ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

**ప్రవాసాంధ్రుల కోసం భీమా సౌకర్యం**

ప్రవాసాంధ్రుల కోసం భీమా కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, రూ.10 లక్షల వరకూ అందరికీ భీమా కల్పించేలా కార్యక్రమం చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని మోహనకృష్ణ తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు 18–60 ఏళ్ల వరకూ వయస్సున్న ప్రవాసాంధ్ర ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులకు ఈ భీమా వర్తింపచేయడం జరుగుతుందని, ప్రవాసాంధ్రులు ఎదుర్కొనే న్యాయపరమైన ఇబ్బందులకు ఎన్నార్టీ సొసైటీ ద్వారా లీగల్ కౌన్సిలింగ్, డాక్యుమెంటేషన్, అడ్వకేట్ ఫీజుల లాంటి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు.

# మొంథా తుపాను సహాయ కార్యక్రమాల్లో చీఫ్ విప్ జీవీ

**● ముందస్తు చర్యలు చేపట్టడం వల్లే ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా నివారించగలిగాం**



వినుకొండ (చైతన్యరథం): మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విస్తృతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాలు, లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో పర్యటించి బాధితులకు అందుతున్న సహాయ కార్యక్రమాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలని, వరద సహాయ కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జీవీ హెచ్చరించారు. తుపాను బాధితుల కోసం వినుకొండ నిర్మల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లపై తుపాను బాధితులను అడిగి తెలుసుకున్నారు. వసతి పొందుతున్న ప్రజలతో మాట్లాడి ఆహారం, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు ధైర్యం చెప్పారు.

**మొంథాను సమర్థంగా ఎదుర్కొంటాం**

మొంథా తుపాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తుపాను రాష్ట్రంలో అనేక ఇబ్బందులు సృష్టిందని, ప్రభుత్వం ఎంతో అప్రమత్తంగా ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించగలిగామన్నారు. సీఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సచివాలయంలోనే ఉండి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారన్నారు. ఆర్టీజీ సెంటర్‌కు వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి రియల్ టైమ్‌లో సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ముందస్తు చర్యలు చేపట్టడం వల్లే ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా నివారించగలిగామన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు అన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు భరోసా ఇచ్చేలా పనిచేస్తున్నామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ ఉపకేంద్రాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లలో కూడా సమస్యలు తలెత్తాయని, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కూలిన విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన తొలగించి సరఫరా పునరుద్ధరించేందుకు ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు, ఇతర సామగ్రిని సిద్ధం చేశారన్నారు. రోడ్లపై కూలిన వృక్షాలను కూడా తొలగించడం జరుగుతుందన్నారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించి సాధారణ స్థితికి తెచ్చేలా అధికార యంత్రాంగం మొత్తం కష్టపడి పనిచేస్తుందన్నారు.

**అన్నదాతలకు అండగా ఉంటాం**

తుపాను ప్రభావంతో పలుచోట్ల గుడిసెలు, మట్టిమిద్దెలు కూలిపోయాయని, వారందరిని ఎన్డీఏ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. నష్టపోయిన వారందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేసి భవిష్యత్తులో వారంతా సంతోషంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. తుపాను కారణంగా రైతులు కూడా నష్టపోయారని, వరి, మొక్కజొన్న, మిర్చి, పత్తి, పొగాకు, కంది సాగుచేసిన రైతులు నష్టపోయారని, వారిని కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తుఫాను బాధితులకు అండగా ప్రభుత్వం : దేవినేని ఉమా

**●ప్రజల భద్రత, రైతుల భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారు**



మైలవరం (చైతన్యరథం): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పరిసర ప్రాంతాల్లో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. తుఫాను సమయంలో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల కృషిని ఆయన ప్రశంసించారు. రైతుల నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి నాయబాబు నాయుడు గత ఐదు రోజులుగా తుఫాను ప్రభావాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టాన్ని తగ్గించే దిశగా అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. అధికారుల హెచ్చరికలను లెక్కచేయకుండా స్వయంగా బాధితులను కలిసి, వారికి ధైర్యం చెప్పి అండగా నిలబడ్డారు. రోడ్డు, రవాణా, విద్యుత్, సమాచార వ్యవస్థలను త్వరితగతిన పునరుద్ధరించేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ చర్యల ద్వారా ప్రజల జీవితాలు సాధారణ స్థితికి త్వరలో చేరుకుంటాయని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు ఆర్టీజీ కార్యాలయంలోనే ఉండి సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు కూడా తుఫాను సహాయక రక్షణ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఈ సమన్వయ కృషి ద్వారా బాధితులకు త్వరిత సహాయం అందుతోంది.

**రైతులకు ప్రోత్సాహం, నష్టపరిహారం చర్యలు**

రైతులు ధైర్యం కోల్పోకుండా వారిని ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బుడమేరు పోటుతో మునిగిన పంట పొలాల్లో నీరు త్వరితగతిన బయటకు పంపించడంతోపాటు పంట రక్షణ చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అండగా నిలబడాలి. నష్టపరిహారం వీలైనంత త్వరగా చెల్లించేందుకు ప్రాథమిక అంచనాలు తయారుచేసి అధికారులు చర్యలు తీసుకోవాలని దేవినేని ఉమా అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ యంత్రాంగం అంతా సిద్ధంగా ఉంది : ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు (చైతన్యరథం): మొంథా తుఫాన్ కారణంగా నష్ట నియంత్రణ కొరకు పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్, నియోజకవర్గంలో అధికార యంత్రాంగం, సిబ్బందితో సమీక్షలు నిర్వహించి పూర్తి స్థాయిలో తుఫాన్ ప్రభావంను ఎదుర్కొనేలా సిద్ధం చేశామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో లీలా డైరీ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్, తుఫాన్ ప్రభావంతో ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలతో మాట్లాడారు. వసతి ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. భోజన ఏర్పాట్లలో ప్రమాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్... ప్రజలకు భోజనాన్ని వడ్డించి, తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని జిల్లా కలెక్టర్, వాతావరణ శాఖ వారి సమాచారం మేరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలు బయటకు వెళ్లకుండా, మీ గృహాల్లో ఉన్న విలువైన వస్తువులు, రోజు వారి ఉపయోగించే దుస్తులు మీతో పాటు పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



# గత పాలకుల నిర్లక్ష్యమే చిలకలూరిపేట పట్టణాన్ని ముంచేసింది

**● జిల్లా కలెక్టర్‌తో కలిసి పునరావాస కేంద్రాలను పరిశీలించిన ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): గత పాలకులు పట్టణ మరియు పరిసర గ్రామాల్లోని డ్రైనేజ్ వ్యవస్థను బాగు చేయకుండా, అవసరమైన చోట కొత్తగా కాలువల నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుతో నేడు మొంథా తుపాను తీవ్రతకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన తుపాను తీవ్రత తగ్గాక పట్టణం మరియు పలు గ్రామాల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాతో కలిసి పర్యటించి, సహాయక చర్యలు పర్యవేక్షించారు. పసుమర్రు ఎస్టీ కాలనీ నీటమునగడంతో స్థానికుల్ని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు తరలించి, భోజన..వసతి ఏర్పాట్లు చేయించారు. అనంతరం పట్టణంలోని డైక్ మెన్ కాలనీ (11వ వార్డు), 17వ, 28వ వార్డు (శాంతినగర్), 29, 30, 38 వార్డుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లోని వారికి స్వచ్ఛమైన తాగునీరు, ఆహారం, దుప్పట్లు అందించాలని, ప్రభుత్వం అందించే ప్రతి సాయం వారికి అందేలా చూడాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, ఇతర నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మించాలని స్పష్టం చేశారు.

**నియోజకవర్గంలో 18 సెం.మీ. వర్షపాతం**

నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 18సెం.మీ. వర్షపాతం నమోదైందని, గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారని ప్రత్తిపాటి తెలిపారు. తుపాను తీరాన్ని తాకే సమయంలో గాలి తక్కువగా ఉండి వర్షం ఎక్కువగా కురిసిందని ప్రత్తిపాటి చెప్పారు. దానివల్ల పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయన్నారు. సంజీవనగర్, శాంతినగర్, వీరముష్టి కాలనీ, జాగుపాలెం, కొండ్రుపాడు, పోలిరెడ్డి పాలెం ప్రాంతాలను వర్షపు నీరు ముంచెత్తిందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి పరిస్థితి తలెత్తినప్పుడు మరలా వరదనీరు జనావాసాల్లోకి రాకుండా డ్రైనేజ్‌లను బలోపేతం చేయాలన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరిందని, దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు.

**పట్టణాభివృద్ధిని నిర్లక్ష్యం చేసిన గత పాలకులు**

ఈ విధమైన పరిస్థితి భవిష్యత్‌లో తలెత్తకుండా ఉండాలంటే పట్టణ డ్రైనేజ్ వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. గత పాలకులు పట్టణాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, రోడ్లు.. డ్రైనేజ్ ల వంటి కనీస వసతుల్ని కూడా అశ్రద్ధ చేశారని, దాని ఫలితమే ఇప్పుడు ప్రజలకు అనుభవిస్తున్న కష్టాలని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఎంత వర్షం వచ్చినా ముమ్ముందు ఎక్కడా నీరు నిలవకుండా, పట్టణంలో కురిసిన వర్షపునీరు మొత్తం కుప్పగంజి, ఓగేరు వాగుల్లోకి చేరేలా ఇంజనీర్లను సంప్రదించి డ్రైనేజ్ వ్యవస్థను సమగ్రంగా పునరుద్ధరిస్తామని ప్రత్తిపాటి తెలిపారు.

**రైతులకు కోలుకోలేని నష్టం..**

రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కేంద్రం తక్షణమే రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని, భవిష్యత్‌లో రైతులు మరలా సాగు చేపట్టాలంటే ఈ తుపానుకు దెబ్బతిన్న వారికి సంపూర్ణ న్యాయం చేయాలని ప్రత్తిపాటి కోరారు. అరకొర సబ్సిడీలు.. రాయితీలు కాకుండా పూర్తిస్థాయిలో రైతులకు సాయం అందించి కేంద్రమే ఆదుకోవాలని మాజీమంత్రి విజ్ఞప్తి చేశారు.

# తుపాను వేళ కంటిమీద కునుకు లేకుండా పర్యవేక్షణ

**●ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే నసీర్**




గుంటూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఏ మారుమూల ఎవరికి ఎలాంటి ఇబ్బంది వస్తుందో? ఏ సమయంలో ఎలాంటి అవసరం వస్తుందో? అనే ఆలోచన. మొంథా తుపాను ప్రభావంతో ప్రజలకు చిన్న కష్టం కూడా రాకూడదనే తపన. అందుకే గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కునుకులేకుండా ప్రజల కోసం పని చేశారు. సీఎం చంద్రబాబునాయుడు స్ఫూర్తితో మంగళవారం రాత్రి 11:30 గంటలకు స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో కార్పొరేటర్లు, కూటమి నాయకులతో కలిసి సమీక్షించారు. వార్డుల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీశారు. రాత్రి 2 గంటల వరకు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని తుపాను ప్రభావాన్ని పర్యవేక్షించిన ఎమ్మెల్యే నసీర్.. రాత్రి 2:30 గంటల వరకు మునిసిపల్ కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ రూము వద్దకు వెళ్లారు. తెల్లవారే వరకు కంట్రోల్ రూము నుంచే అధికార యంత్రాంగంతో మాట్లాడుతూ... అన్ని ప్రాంతాల్లో తుపాను ప్రభావంపై ఆరా తీశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం, చెట్లు విరిగిపడటం, పునరావాస కేంద్రాల్లో వసతి సదుపాయాలు, వరద నీటి పారుదల వంటి సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులను అధికార యంత్రాంగంతో సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చేశారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గిపోయే వరకు ప్రజలకు రక్షణగా నిలుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

# వావింటపర్తిలో చురుగ్గా వాగు పూడికతీత పనులు

## స్వయంగా పర్యవేక్షించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, కాకాణి వ్యాఖ్యలకు ఖండన



సర్వేపల్లి, (చైతన్యరథం): పొదలకూరు మండలం వావింటపర్తిలో వాగు పూడికతీత పనులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిశీలించారు. ఎస్టీ కాలనీలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసి, భారీవర్షాల నేపథ్యంలో వారి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందని, కండలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కొనసాగితే పర్వతాపురం, పులికల్లు, అంకుపల్లి, వావింటపర్తి, ఊచపల్లి గ్రామాలు ముంపు ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలిపారు. ఇబ్బందులు రాకుండా ఆరు ప్రొక్లెయిన్లను వినియోగించి వాగు పూడికతీత పనులు వేగంగా చేపట్టామని చెప్పారు. స్పిల్‌వే నుంచి దేగపూడి వరకు వరద ప్రవాహం సాఫీగా సాగిపోవడానికి రూ.95 కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు పంపించారని వెల్లడించారు. 50 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చినా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో వాగుల్లో కర్రతుమ్మ చెట్లు విస్తారంగా పెరిగిపోయి వాగు ప్రవాహానికి ఆటంకం కలిగించాయన్నారు. ఇప్పుడు వాటిని యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నామని సోమిరెడ్డి తెలిపారు. కాకాణి వ్యాఖ్యలపై ఆయన మాట్లాడుతూ "కౌబాయ్ వేషంలో ఒకాయన సర్వేపల్లి నియోజకవర్గంలో తిరుగుతున్నాడు. నావి కోడికాళ్లంటాడు, గాలి కొడితే ఎగిరిపోతానంటాడు. కానీ ప్రజల సొత్తు అక్రమంగా తిని ఆయనలా అడ్డంగా బలవలేదు. నేను సన్నగా ఉన్నా, గాలి కొడితే ఎగిరిపోతానేమో కానీ మనసు మాత్రం ప్రజలపట్ల నిబద్ధతతో నిండిపోయి ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. అదే సమయంలో కాకాణి శరీరాన్ని, ప్రవర్తనను ఎద్దేవా చేస్తూ "కాకాణి కాళ్లు ఎలా ఉంటాయో ప్రజలందరికీ తెలుసు... నేల మీద నుంచి రెండు అడుగుల ఎత్తులో ఉండే ఓ నల్ల జంతువు కాళ్ళ ఉంటాయని అందరూ చెబుతుంటారు" అంటూ ఘాటుగా దాడి చేశారు. "నిద్రలేచినప్పటి నుంచి నాకు, నా కొడుక్కి వందల కోట్లు అంటున్నాడు. ఆ వందల కోట్లు ఎక్కడ పెట్టాలో అర్థం కావడం లేదు. కరోనా హౌస్ అయినా బాడుగకు ఇస్తే అక్కడైనా పెడతాం" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు సర్వేపల్లి నియోజకవర్గాన్ని కాకాణి పూర్తిగా భ్రష్టు పట్టించారని, నావూరుపల్లిలో ఎస్టీ ఇళ్లను కూడా వదిలిపెట్టలేదని ఆరోపించారు. "వర్షాల మధ్య కూడా నన్ను, నా కొడుకునూ తిట్టడమే ఆయన పని. మూడు రోజులు కనిపించకుండాపోయి, కోటు వేసుకుని వచ్చి తిట్టి వెళ్ళిపోయాడు. 204 రోజులు కనిపించకపోయి వచ్చినా ఆయనలో మార్పు రాకపోవడం దురదృష్టకరం" అని సోమిరెడ్డి విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న వాగు పనులపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, గ్రామాల్లో ముంపు ప్రమాదం తగ్గించడానికి టీడీపీ నాయకత్వం కృషి కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

## దుద్దుకూరు టీడీపీ బృందాల తుపాను సేవలు ప్రశంసనీయం




దుద్దుకూరు, (చైతన్యరథం): తుపాను సమయంలో దుద్దుకూరులో టీడీపీ బృందాల సేవలు అభినందనీయమని స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల జిల్లా, పర్చూరు నియోజకవర్గం, ఇంకొల్లు మండలం, దుద్దుకూరు గ్రామం లో తుఫాను సమయంలో ప్రభుత్వ ఆదేశాలు, మండల అధికారుల సూచనలతో టీడీపీ నాయకులు, పంచాయితి సచివాలయ సిబ్బంది, తక్షణమే చర్యలు తీసుకుని ప్రజల పక్షాన నిలిచారు. తొలుత దుద్దుకూరు వాగు పొంగడంతో ట్రాక్టర్లు అడ్డుపెట్టి రాకపోకలను అత్యవసర పరిస్థితులను బట్టి క్రమబద్ధీకరించారు. మొంథా తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం వల్ల గుండ్లకమ్మ ఎడమకాలువ ఉధృతితో ఊరచెరువు సామర్థ్యానికి సవాలుగా మారింది. అలుగు ద్వారా యారకాలువ(ఊరవాగు) వంతెన పైనుంచి 5అడుగుల మేర ప్రవహిస్తుండటంతో ఒంగోలు, ఇంకొల్లు రహదారిపై రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. గుండ్లకమ్మ వరద ప్రవాహం నివారణకు రాచపూటి సమీపంలోని గంటవారి కుంట వద్ద తూములకు అడ్డుగా ఉన్న కట్టలను ముందుగా తొలగించడంతో 18 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఊర చెరువుకు పెద్ద ముప్పు తప్పింది. తుపానుకు గాలి వేగం తోడవడటంతో చెరువు గట్టు మీదున్న వందేళ్ల నాటి మర్రి చెట్టు కూలిపోయింది. గత 2 రోజులుగా పల్లపు ప్రాంతంలో ఉన్నవారికి గ్రామంలోని ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరం లో ఆహారం, తాగునీరు అందజేశారు. దుద్దుకూరు పంచాయతీ, సచివాలయ సిబ్బంది పూర్తి సహకారంతో, ప్రజలు సురక్షితంగా ఉన్నారో లేదో పరిశీలిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన సహాయ సహకారాలు అందించారు.



## తుపాను బాధిత ప్రాంతాల్లో ఎరిక్సన్‌బాబు సుడిగాలి పర్యటన

యర్రగొండపాలెం, (చైతన్యరథం): దోర్నాల మండలం సానికవరం వద్ద బొమ్మలాపురం నుండి వస్తున్న రాళ్ళవాగు ప్రవాహన్ని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుఅధికారులతో కలిసి పరిశీలించారు. సహాయక చర్యలు, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులను కోరారు.

# అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు!

## అన్నదాతలకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భరోసా



దర్శి, (చైతన్యరథం): బసిరెడ్డి పల్లి గ్రామంలో పత్తి పంటను దర్శి టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పరిశీలించారు. ఆమె వెంట వ్యవసాయ అధికారులు ఏఓ రామాదేవి, స్థానిక నాయకులు ఉన్నారు. తుఫాన్ బీభత్సానికి దర్శి నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంట నష్టపోవడంతో డాక్టర్ గొట్టిపాటి స్పందించారు. నియోజకవర్గంలో పంట నష్టాలపై అధికారులను కోరామన్నారు. గత రెండు రోజులుగా కుంభ వృష్టిగా కురిసిన వర్షం రైతులకు తీరని నష్టం కలిగించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, మిర్చి, వరి, పొగాకు, కంది పంటల లతో పాటు కొన్ని ఉద్యాన తోటలు వర్షానికి దెబ్బతిన్నాయని ఆమె వివరించారు. జరిగిన నష్టం పై ప్రభుత్వానికి నివేదిక అందజేసి రైతులను ఆదుకుంటామని ఆమె వివరించారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఇప్పటికే రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు.



మొంథా తుఫాన్ నేపథ్యంలో కనిగిరి మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలలో నాయకులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

## తుపాను బాధిత ప్రాంతంలో ఎమ్మెల్యే కందుల పర్యటన

మార్కాపురం, చైతన్యరథం): ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం మండలంలోని గుండ్లకమ్మ వాగు నుండి మార్కాపురం చెరువు సప్లై ఛానల్‌ను కొండేపల్లి గ్రామం వద్ద పరిశీలించారు. అనంతరం గ్రామంలో ముంపు బారిన పడిన గృహాలను సందర్శించారు. అనంతరం మార్కాపురం పట్టణంలో మల్లారెడ్డి కాలనీ సమీపంలో గుండ్లకమ్మ వాగులో చిక్కుకున్న 11 గేదెలను రక్షించడానికి కలెక్టర్‌కు సమాచారం అందించారు. ఒంగోలు నుండి ఏపీ ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు తమ పడవతో మార్కాపురం గుండ్లకమ్మ వద్దకు చేరుకున్నారు. చీకటి పడటంతో రెస్క్యూ ఆపరేషన్ నిలిచిపోయింది. ఉదయాన్నే రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించి గేదలను రక్షిస్తామని ఎమ్మెల్యే చెప్పారు.



## గిరిజన కాలనీలో కావలి ఎమ్మెల్యే పర్యటన

కావలి, (చైతన్యరథం): మండల పరిధిలోని ఆనెమడుగు పంచాయతీ ఆకుతోట గిరిజన కాలనీలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఇరిగేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. విస్తారంగా వర్షాలు కురవడంతో సమీపంలో ఉన్న మద్దూరుపాడు టిడ్కో నివాసాల్లోకి నీరు చేరి ఆ ప్రాంతాలు ప్రజలు ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆనెమడుగు చెరువు కలుజు మట్టం నీరు వెళ్ళినప్పుడు కొంత నీరు టిడ్కో నివాసాల్లోకి పోతున్న పరిస్థితిని జిల్లా అధికారులకు వివరించారు. ఆనెమడుగు చెరువు ప్రాంతపు రైతులతో మాట్లాడి రైతుల అనుమతి తీసుకొని ఎగువ భాగం నుంచి వచ్చే వర్షపు నీటిని మరో ప్రాంతానికి మళ్ళించే ప్రయత్నం చేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు.



జోన్-5 (నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)

చైతన్యరథం

# తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం

## జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి



జమ్మలమడుగు, (చైతన్యరథం): జమ్మలమడుగు మండలం ధర్మాపురం, గౌరిగనూరు గ్రామాలలో మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటను అధికారులతో కలిసి జమ్మలమడుగు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మండల వ్యవసాయ అధికారికి ఎక్కడైతే వరి పంట దెబ్బ తినిందో అక్కడికి వెళ్లి పరిశీలించవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లికార్జున, జిల్లా అధికార ప్రతిని శ్రీనివాసులు, పెద్ద దండ్లూరు సర్పంచ్ రామాంజనేయులు రెడ్డి, ధర్మాపురం , గౌరిగినూరు గ్రామాలకు సంబంధించిన రైతులు వ్యవసాయ అధికారులు, పాల్గొన్నారు.



# సత్వరం సహాయక చర్యలు చేపట్టండి

## అధికారులకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపు

పాణ్యం, (చైతన్యరథం): మొంథా తుఫాన్ నేపథ్యంలో గడివేముల మండలంలోని కొర్రపోలూరు, పెసరవాయి, కరీమద్దెల, దుర్వేసి గ్రామాల్లో వర్షాల కారణంగా రైతుల మొక్కజొన్న పంటలు, మొలకెత్తిన మినుముల పంటలు నష్టపోవడం, పలు గ్రామాలలో ఇంటి మిద్దెలు కూలిపోయిన ప్రాంతాలను తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సందర్శించారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు చేపట్టాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అధికారులను ఆదేశించారు.

# కాంగ్రెస్, వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు

## కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి




అమరాపురం, (చైతన్యరథం): హేమావతి పంచాయితీ కేంద్రంలో వైసీపీ కాంగ్రెస్, పార్టీకి చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి గారి ఆధ్వర్యంలో మాజీ టెంపుల్ చైర్మన్ నాగరాజు, రవీంద్రతోపాటు 100కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి పసుపు కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్, ఆధ్వర్యంలో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పరిశ్రమలు రాష్ట్రానికి పరుగులు పెడుతున్నాయని దానివల్ల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అదేవిధంగా రైతులకు హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరు ఇస్తున్నారని, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని త్వరలో అమరాపురం మండలానికి హంద్రీనీవా జలాలు వస్తున్నాయని గ్రహించి తాము కూడా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని గ్రహించి టీడీపీలో చేరామన్నారు. ఇన్ని సంవత్సరాలు వైసీపీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న తమకు న్యాయం జరగలేదని, మమ్ములను నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు, ,ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మడకశిర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, క్లస్టర్ ఇన్చార్జిలు కృష్ణమూర్తి, ఎంపిటిసి ఓంకార్ స్వామి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కార్యదర్శి నాగరాజు, నవీన్, డైరెక్టర్ దాదు, టెంపుల్ చైర్మన్ కరేగౌడ్, ప్రకాష్ శివకుమార్ శ్రీనివాస్ మంజునాథ్, తిప్పజ్జ, కుమార్ స్వామి, తిమ్మే గౌడ, రామచంద్రప్ప, రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు,

మడకశిర మండల వైసీపీ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ నరసింహమూర్తి మరియు హరే సముద్రం గ్రామానికి చెందిన, హనుమంతరాయప్ప నారాయణప్ప, రమేష్ ,భూతప్ప నాగరాజు, శివమ్మ, 20 కుటుంబాలు వైసిపి పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. వీరికి పసుపు కండువా కప్పి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు నాగరాజు, సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా, ఎంపీటీసీ హనుమంతరాయప్ప, కరియన్న, జయరాం, నాగేంద్రప్పా, రమేష్,నరసింహమూర్తి నారాయణప్ప,మారుతి ,హరి, మాజీ ఎంపీటీసీ నంజుండ, రామాంజనేయులు నాయకులు పాల్గొన్నారు.




**పుట్టపర్తి నియోజకవర్గంలోని కొడవగానిపల్లికి చెందిన మహబూబ్ ఖాన్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 71, 250లకు నాగేంద్రకు రూ. 26, 477లకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

# కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ. 25 లక్షలిస్తా

## బలిజ నేతలకు ఎంపీ పార్థసారథి హామీ

హిందూపురం, (చైతన్యరథం): హిందపూర్ టౌన్ బలిజ సంఘం నాయకులు కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికే పార్థసారథిది కోరారు. ఎంపీ స్పందిస్తూ 25 లక్షల రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. బలిజ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ వెంకటరాముడు, మహేష్ కుమార్ ఆర్టీసీ జగదీష్, విజయ్, నాగరాజు, రజినీకాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ముందస్తు సహాయక చర్యలతో ప్రాణ నష్టం నివారించగలిగాం

## తుఫాను ప్రభావిత గ్రామాల్లో పర్యటించి బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు, నాయకులు ముంపు గ్రామ వాసులను సురక్షిత ప్రాతాలకు తరలించడం వల్ల ప్రాణ నష్టం నివారించగలిగామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో ఎస్టీ కాలనీలో మొంథా తుఫాను ధాటికి కూలిపోయిన ఇళ్లను ఆమె పరిశీలించారు. 44 కుటుంబాలకు చెందిన 100 మందికి పైగా గిరిజనులు ఆశ్రయం పొందుతున్న పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ముంపనుకు గురయ్యే అవకాశం వున్న గిరిజన కాలనీ వాసులను అధికారులు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా తరలించడంతో ప్రాణ నష్టం తప్పిందన్నారు. పరస్పర సమన్వయంతో పని చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టిన అధికారులు, నాయకులను ఆమె అభినందించారు. కూలిపోయే దశలో వున్న పార్లపల్లి గిరిజన కాలనీ ఇళ్ల దుస్థితి గురించి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా గిరిజనుల ఇళ్ల పునర్నిర్మాణానికి ప్రభుత్వం సమ్మతించిందని తెలిపారు. గిరిజన కాలనీ పునర్నిర్మించే వరకు వారికి తాత్కాలిక నివాసాలు ఏర్పాటు ఏర్పాటు చేస్తామన్నారు. పునరావాస కేంద్రాలలో తలదాచుకుంటున్న వరద బాధితులకు ప్రభుత్వం 3 వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యం, 1 కేజీ కందిపప్పు, 1 కేజీ వంట నూనె కిలో ఉర్లగడ్డలు, కిలో ఎర్రగడ్డలు అందచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ వెంకటేశ్వర్లు రెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్ కుమారి పార్లపల్లి సర్పంచ్ రామిశెట్టి స్వాతి, విడవలూరు టీడీపీ మండల అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు తాత బాలకృష్ణ, అడపాల జనార్ధనరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు మరియు పందుల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.





# గగన సీమలో ఘనత వహించిన భారత నారీమణులు

## రఫేల్ యుద్ధ విమానంలో మహిళా పైలెట్‌తో రాష్ట్రపతి ముర్ము విహారం



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఇందులో యుద్ధ విమాన పైలట్ శివాంగీ సింగ్ దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆమెను బంధించినట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్‌కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలెట్‌ను బంధించామని పాక్ అబద్ధాలు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగి సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇప్పుడు ఆమెతో రాష్ట్రపతి ముర్ము ఫొటో దిగడంతో శివాంగీ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె కోసం నెటిజన్లు శోధిస్తున్నారు.

**వాయుసేన 'గోల్డెన్' గర్ల్**

సింగ్ స్వస్థలం వారణాసి, అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్సీసీలో చేరారామె. ఆపై 2016లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనం నుంచే పక్షిలా ఆకాశంలో ఎగరాలని కలలు కన్న ఆమె, ఎప్పటికైనా పైలట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ యుద్ధ విమాన పైలట్లుగా నియమితులైన మోహన్ సింగ్, భావనా కాంత్, అవనీ చతుర్వేది స్ఫూర్తితో పైలట్ శిక్షణ తీసుకున్నారు. 2017లో రెండో దశ యుద్ధ విమాన పైలట్లలో ఒకరిగా ఎంపికైన శివాంగి... మిగ్–21 బైసన్ యుద్ధ విమానాలు నడపడంలో ప్రావీణ్యం సాధించారు. మిగ్ ఫైటర్ జెట్ నడిపిన అనుభవంతోనే 2020లో దేశంలోనే అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం దక్కించుకున్నారు. అప్పటి నుంచి అంబాలా ఎయిర్ బేస్‌లోని గోల్డెన్ యారోస్' స్క్వాడ్రన్ బృందంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

2025లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 'భవిష్యత్తు కోసం భారత వైమానిక దళం రూపాంతరం చెందుతోంది' అనే థీమ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శకటాన్ని ప్రదర్శించింది. ఈ శకటంలో రఫేల్ ఫైటర్ జెట్ యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శకటంపై శివాంగ్ సింగ్ సెల్యూట్ చేస్తూ కనిపించారు. గణతంత్ర వేడుకల పరేడ్లో పాల్గొన్న రెండో పైలట్ గా ఘనత సాధించారు. ఆ సమయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా 'రఫేల్ రాణి' అంటూ చేసిన పోస్ట్ ఆకట్టుకుంది.

# పాక్‌తో సంబంధాలున్న గూఢచారి అరెస్టు

### భారీ నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో భారత యంత్రాంగం

గూఢచర్యానికి పాల్పడుతూ, నకిలీ పాస్‌పోర్టు రాకెట్ నడుపుతున్న 50 ఏళ్ల వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విదేశీ అణు శాస్త్రవేత్తలతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ సహా పలు దేశాలకు పర్యటించినట్లు పేర్కొన్నారు. భారత్‌కు చెందిన అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. నిందితుడి పేరు మహమ్మద్ ఆదిల్ హుస్సైనీ, ఇంకా రెండుమూడు మారు పేర్లతో విదేశాల్లోని అణుశాస్త్రవేత్తలను పలుమార్లు సంప్రదించినట్లు. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడని అధికారులు అనుమానిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి నుంచి అసలు, నకిలీ పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. దేశ భద్రతలో కీలకమైన సంస్థలకు సంబంధించిన ఐడీ కార్డులు కలిగి ఉన్నట్లు గుర్తించారు. అతడి నెట్వర్క్ ఝార్ఖండ్‌లోని జంషెడ్పూర్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోందని. అక్కడ నకిలీ ఐడీలు, పాస్‌పోర్టులను తయారుచేస్తున్నారని తెలిపారు. రష్యా అణుశాస్త్రవేత్త నుంచి డిజైన్‌ను ఇరాన్ శాస్త్రవేత్తకు విక్రయించినట్లు దర్యాప్తులో భాగంగా ఆదిల్ వెల్లడించినట్లు సమాచారం. అలా వచ్చిన సొమ్మును. దుబాయ్‌లో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది.

ఆదిల్‌తో పాటు అతడి సోదరుడు అక్తర్ సున్నితమైన సమాచారాన్ని విక్రయించి, నకిలీ పత్రాల ద్వారా పలు దేశాలకు చెందిన పాస్‌పోర్టులను పొందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అక్తర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. కేఫ్ నడుపుతున్న మరో అనుమానితుడిని అరెస్టు చేశామని, నెట్వర్క్‌లో భాగమైన మిగిలినవారు పరారీలో ఉన్నారని పోలీసు అధికారి ప్రమోద్ సింగ్ కుష్వాహ్ మీడియాకు వెల్లడించారు. ఈ నెట్వర్క్ ద్వారా ఎంతమందికి నకిలీ పాస్పోర్టులు అందాయనే దిశగా పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఒక్కో ఉద్యోగానికి రూ.35 లక్షల ముడుపులు

- **ప్రభుత్వ నియామకాల్లో భారీ కుంభకోణం**
- **తమిళనాడు ఉన్నతాధికారులకు లేఖ రాసిన ఈడీ**



తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో భారీ కుంభకోణం బయటపడింది. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25, 35 లక్షలు చొప్పున ముడుపులు తీసుకున్నట్లు తెలిసింది. ఓ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ జాబ్ స్కామ్ ను గుర్తించిన అధికారులు, దీనిపై తమిళనాడు పోలీసు విభాగానికి తాజాగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఈ కుంభకోణం వెనక శక్తిమంతమైన రాజకీయ నాయకులు, ప్రముఖులు ఉన్నారని ఈడీ అధికారులు ఆరోపించినట్లు సమాచారం. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలోని అసిస్టెంట్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితర పోస్టుల కోసం 2024లో రిక్రూట్మెంట్ ప్రక్రియ ప్రారంభించారు. దాదాపు 1.12 లక్షల మంది ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నియామక పరీక్ష నిర్వహించి 2,538 మందిని ఎంపిక చేశారు. ఈ ఏడాది ఆగస్టులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా వీరికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అయితే, ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఈడీ ఆరోపించింది. దాదాపు 150 మంది అభ్యర్థులకు అనుకూలంగా పరీక్షల్లో రిగ్గింగుకు పాల్పడినట్లు పేర్కొంది. దీనికోసం ఆయా అభ్యర్థుల నుంచి రూ.25, 35 లక్షల చొప్పున లంచాలు తీసుకున్నట్లు తెలిపింది. దీని వెనక రాష్ట్రంలోని కీలక రాజకీయ నాయకులు, కొన్ని సంస్థలు ఉన్నట్లు ఆరోపించింది. దీనిపై దర్యాప్తు చేయాలని కోరుతూ తమిళనాడు పోలీసు ఉన్నతాధికారులకు ఈడీ లేఖ రాసింది. ఈ ఆరోపణలకు సంబంధించి 232 పేజీల ఆధారాలను సమర్పించింది. ఈ పరీక్ష నిర్వహించిన అన్నా యూనివర్సిటీపై దర్యాప్తు చేయాలని ఈడీ కోరినట్లు ఆ కథనం వెల్లడించింది. దీంతో ఈ వ్యవహారం కాస్తా రాజకీయ దుమారం రేపింది. ఈ కథనాన్ని ప్రముఖ నటుడు విజయ్‌పార్టీ టీవీకే తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. అయితే, ఈ వార్తలపై తమిళనాడు ప్రభుత్వం గానీ, సీఎం స్టాలిన్ గానీ ఇంతవరకూ స్పందించలేదు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ కుంభకోణం అంశం కీలకంగా మారనుంది.

# ఆ మాట నేనే ఎందుకు పడాలి : కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

### జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్ ప్రతిపాదనపై వివరణ



దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్లను ప్రవేశపెట్టాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. పౌరులు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ ప్రాజెక్టు కోసం పని చేసిన కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, నిర్మాణానికి మంజూరు చేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ వంటి కీలక వివరాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు. 'స్మార్ట్ రోడ్ల భద్రత అనే అంశంపై ఢిల్లీలో నిర్వహించిన ఓ సమావేశంలో ప్రసంగించిన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు.

రోడ్లు బాగా లేకపోతే అందరూ తననే నిందిస్తారని, మొత్తం వ్యవస్థ చేసిన తప్పునకు తాను మాత్రమే ఎందుకు తిట్లు తినాలని, సోషల్ మీడియాలో ఆరోపణలపై ఎందుకు స్పందించాలని నితిన్ గడ్కరీ చమత్కరించారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారమంతా ప్రజలకు బహిర్గతం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అప్పుడే రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడే అధికారులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. "రోడ్లపై క్యూఆర్ కోడ్లను ఏర్పాటుచేయడం వల్ల దానిని మంజూరు చేసిన మంత్రి ఎవరు, దాని నిర్మాణం కోసం పనిచేసిన కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు వారి ఫోన్ నంబర్లు ఫొటోతో సహా అన్ని వివరాలు ప్రజలకు, విలేకరులకు అందుబాటులో ఉంటాయి. ఆయా రోడ్లపై ఏదైనా సమస్య వస్తే వారు నేరుగా ఆ అధికారులనే ప్రశ్నించే అవకాశం ఉంటుంది" అని అన్నారు.

# సొంతకారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వరు

### కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే వితండ వ్యాఖ్యలు

సొంతకారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వరంటూ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలను తీర్చేందుకు ప్రతిపాదించిన టన్నెల్ రోడ్ ప్రాజెక్టును సమర్థిస్తూ కాంగ్రెస్ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన మాటలను భాజపా ఎద్దేవా చేసింది. ఈ టన్నెల్ ప్రాజెక్టును రద్దు చేసి, మాస్ ట్రాన్స్‌పోర్టును విస్తరించాలని కోరుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య డీకేను కలిశారు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలు కార్లు కొనడం వెనక ఉన్న సామాజిక పరిస్థితి సూర్యకు అర్థం కాదని వ్యాఖ్యానించారు. "మీరు సొంత వాహనంలో రాకుండా నేను ఆపగలనా? ప్రజలు వారి కుటుంబాలతో కలిసి సొంతవాహనాల్లో వెళ్లడానికే మొగ్గుచూపుతారు. వారిని కార్లు వాడొద్దని చెప్పగలమా..? అంతగా అవసరం అనుకుంటే ప్రజా రవాణా వాడుకోమని తమ నియోజకవర్గ ప్రజలకు ఎంపీలు విజ్ఞప్తి చేసుకోవచ్చు. అయితే దానిని ఎంతమంది వింటారో చూడాలి. కారులేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వడానికి కూడా ప్రజలు ఆలోచిస్తున్న పరిస్థితి ఉంది' అని శివకుమార్ మీడియాతో అన్నారు.

దీనిపై తేజస్వి స్పందిస్తూ.. "బెంగళూరు ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి టన్నెల్ రోడ్ ప్రాజెక్టును తీసుకువచ్చారని అంతకాలం నేను అపార్థం చేసుకున్నాను. కానీ ఇది ఒక సామాజిక సమస్యను తీర్చడానికి ఉద్దేశించిందని డిప్యూటీ సీఎం స్పష్టత ఇచ్చారు. నేను ఎంత తెలివితక్కువగా ఆలోచించాను" అని డీకే వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ఉపముఖ్యమంత్రితో భేటీ సందర్భంగా టన్నెల్ రోడ్ ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయాన్ని, ప్రజారవాణాకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రతిపాదనలు చేశానని వెల్లడించారు. అయితే వాటన్నింటిని ఆయన తిరస్కరించారని చెప్పారు. బెంగళూరు ట్రాఫిక్ సమస్యలతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ ఐటీ రాజధాని కష్టాలకు టన్నెల్ ప్రాజెక్ట్ ఒక మంచి పరిష్కారం అని డీకే ఎప్పటినుంచో చెప్తున్నారు. దానివల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రజా రవాణా విషయంలో సరైన పరిష్కారం కాదని సూర్య వ్యతిరేకిస్తున్నారు.

# కలుషితాహారంతో 128 మంది విద్యార్థులకు అస్వస్థత

### హాస్టళ్లను మూయించి దర్యాప్తునకు ఆదేశించిన తమిళనాడు కలెక్టర్

తమిళనాడులోని ఎక్సెల్ కళాశాలలో 128 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కుమారపాళయంలోని ఎక్సెల్ కళాశాల హాస్టళ్లలో కలుషితాహారం తిని.. గత మూడు రోజులుగా 128 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 26న రాత్రి భోజనం చేసిన తర్వాత నలుగురు విద్యార్థినులకు కడుపునొప్పితో పాటు వాంతులు అయ్యాయి. దీంతో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మరుసటి రోజు మూడు బాలికల హాస్టళ్లు, రెండు బాలుర హాస్టళ్లలో 55 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజులుగా మొత్తం 128 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయినట్లు అధికారులు తెలిపారు. ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపామన్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కళాశాలకు చెందిన పలు హాస్టళ్లలో మొత్తం దాదాపు 3,757 మంది బాలురు, బాలికలు ఉండగా ఉమ్మడి వంటగదిలో వారికి ఆహారాన్ని తయారు చేసి వివిధ మెస్లకు పంపిణీ చేస్తున్నట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో నవంబర్ 2వ తేదీ వరకు మెస్లను మూసివేయాలని, కళాశాలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్ దుర్గామూర్తి కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రాథమిక విచారణలో నీటి నిల్వ ట్యాంకులను సరిగా శుభ్రం చేయనట్లు ఆహార భద్రత శాఖ అధికారులు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

# బాల్టిక్‌లో నిలిచిన రష్యా చమురు ట్యాంకర్

## ట్రంప్ ఆంక్షల నేపథ్యంలో భారత్‌కు చేరిన వైనం




ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యాతీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో రష్యానుంచి భారత్‌కు జరుగుతోన్న చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడినట్టు కనిపిస్తోంది. ఆ దేశ ముడిచమురుతో భారత్‌వైపు వస్తోన్న ట్యాంకర్ మార్గమధ్యలో యూటర్న్ తీసుకుంది. బాల్టిక్ సముద్రంలో నిలిచిపోయింది. డెన్మార్క్, జర్మనీ మధ్యనున్న జలసంధిలో పశ్చిమంవైపుగా వెళ్తున్న ఒక ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వెనక్కి మళ్లింది. కొంతదూరం వెళ్లిన తర్వాత నెమ్మదించిందని షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడించింది.

ఇదిలాఉంటే.. ఈ ఆంక్షల నేపథ్యంలో హెచ్‌ఎంఈఎల్ సంస్థ అధికారులు రష్యా చమురును కొనుగోలు చేశారు. ఈ రిఫైనరీ.. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మిత్తల్ గ్రూప్ భాగస్వామ్యంలో నడుస్తోంది. ఆర్సెలార్ మిత్తల్‌కు చెందిన ఎనర్జీ విభాగం ఆంక్షల పరిధిలో ఉన్న నౌకల ద్వారా ముడి చమురును గుజరాత్‌లోని ముంద్రా నౌకాశ్రయానికి దిగుమతి చేసుకొని అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పంజాబ్‌లోని గురుగోవింద్ సింగ్ రిఫైనరీకి సరఫరా చేసినట్టు ఆంగ్ల పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. ఇది దేశంలోనే పదో అతిపెద్ద రిఫైనరీ. ఒక ఏడాదికి 11.3 మిలియన్ టన్నుల ముడిచమురును ప్రాసెస్ చేస్తుంది. "జులై–సెప్టెంబర్ మధ్యలో ముర్మాన్స్క్‌లోని ఆర్కిటిక్ పోర్ట్‌నుంచి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకు అమెరికా ఆంక్షల జాబితాలో ఉన్న నౌకల్లో చమురు రవాణా అయింది. అలాగే ఈ రవాణాను కప్పిపుచ్చుకునేందుకు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయి" అని మీడియా కథనం పేర్కొంది. షిప్పింగ్ డేటా, కస్టమ్స్ రికార్డ్, శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. ఈ నౌకల్లో రవాణాను ఎవరు ఏర్పాటు చేశారనేది మాత్రం తెలియదని వెల్లడించింది.

రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తోపాటు వాటి అనుబంధ సంస్థలనుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అగ్రరాజ్యం నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా, పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడోవంతు రష్యానుంచే వస్తోంది. ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. గతంలోనూ రష్యాపై అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ.. ఈసారి వాటి తీవ్రత ఎక్కువగా ఉంది.

# ట్రంప్‌నకు గోల్డ్ క్రౌన్!

## సిద్ధం చేసిన దక్షిణ కొరియా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు దక్షిణ కొరియా అరుదైన గౌరవం ఇవ్వనుంది. ట్రంప్‌నకు దక్షిణ కొరియా అత్యున్నత అవార్డు గ్రాండ్ ఆర్డర్ ఆఫ్ ముగుంగ్వా, చియోన్మాచాంగ్ నకలు బంగారు కిరీటం ప్రదానం చేయడానికి సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి ట్రంప్ ఇప్పటికే దక్షిణ కొరియాకు చేరుకున్నారు. బుధవారం గ్యోంగ్జు నేషనల్ మ్యూజియంను సందర్శించనున్న నేపథ్యంలో అక్కడ అమెరికా అధ్యక్షుడికి దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జె మ్యుంగ్ బంగారు కిరీటం నకలును బహుమతిగా ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. కొరియా ద్వీపకల్పంలో సుదీర్ఘకాలం శాంతిని స్థాపించిన సిల్లా చరిత్రకు ప్రతీకగా ఈ బంగారు కిరీటాన్ని ఇస్తారని దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ప్రపంచ దేశాల్లో శాంతిని నెలకొల్పడానికి ట్రంప్ చేస్తున్న అవిశ్రాంత ప్రయత్నాలకు గుర్తింపుగా ఈ అత్యున్నత అవార్డును ఆయనకు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొంది. మలేసియా, జపాన్‌లో పర్యటన ముగించుకున్న ట్రంప్ దక్షిణ కొరియా చేరుకున్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ఆయన ఉన్నతస్థాయి వాణిజ్య చర్చలు జరపనున్నారు. అమెరికా విధించిన సుంకాలు, అంతర్జాతీయ పరిస్థితులపైనా వీరు చర్చించుకోనున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా లీ జే–మ్యుంగ్ అమెరికా అధ్యక్షుడి కోసం ప్రత్యేకమైన విందును సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఈ విందుకు వియత్నాం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, థాయ్లాండ్, సింగపూర్ నేతలు హాజరవ్వనున్నారు. ట్రంప్ మంగళవారం జపాన్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశ ప్రధాని సనాయె తకాయిచి ఆయనను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తానని హామీ ఇచ్చారు. థాయిలాండ్ -కంబోడియాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో ట్రంప్ విజయం సాధించారని.. ఇక, పశ్చిమాసియాలో కుదిర్చిన ఒప్పందం (ఇజ్రాయెల్–హమాస్) చరిత్రాత్మకమైందని కొనియాడారు.

# రెచ్చిపోతున్న బిష్ణోయ్ గ్యాంగు

### కెనడాలో భారత పారిశ్రామికవేత్త హత్య



కెనడాలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ విధ్వంసం రోజురోజుకీ పెరిగి పోతుంది. ఇటీవల ఆ దేశంలో భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త దర్శన్ సింగ్ సహాసి హత్యకు గురయ్యారు. దర్శన్‌ను తామే చంపామని తాజాగా బిష్ణోయ్ గ్యాంగ్ అంగీకరించింది. ఈ మేరకు బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడైన గోల్డీ ధిల్లాన్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. సహాసి మాదకద్రవ్యాల వ్యాపారంలో భాగమయ్యాడని ఆరోపించాడు. అతనివద్ద నుంచి తాము డబ్బు డిమాండ్ చేశామని.. అది అందకపోవడంతో చంపేశామని పేర్కొన్నాడు. అధికారుల వివరాల మేరకు... సోమవారం అబోట్స్‌ఫోర్డ్‌లోని సహాసి (66) ఇంటి వెలుపల జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. పారిశ్రామికవేత్త తన ఇంటి వెలుపలున్న కారువద్దకు వెళ్తుండగా.. అప్పటికే అక్కడ మరో కారులో దుండగుడు వేచి ఉన్నట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాల్పుల అనంతరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికే సహాసి ప్రాణాలు కోల్పోయారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతుంది. ఈ క్రమంలో బిష్ణోయ్ గ్యాంగ్ తామే ఈ హత్య చేశామని ప్రకటించడం గమనార్హం. 1991లో సహాసి కెనడాకు వెళ్లారు. తొలుత చిన్న ఉద్యోగిగా పనిచేసిన ఆయన.. తర్వాత నష్టాల్లో ఉన్న ఓ వస్త్ర యూనిట్‌లో వాటా సంపాదించారు. తర్వాత దాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించారు. సహాసి హత్య నేపథ్యంలో కెనడాలో భారతీయుల భద్రతపై మరోసారి చర్చ మొదలయ్యింది.

***పంజాబీ గాయకుడే లక్ష్యంగా కాల్పులు..***

ఇదిలాఉండగా.. కెనడాలోని పంజాబీ గాయకుడు చాని నట్టన్ ఇంటి వెలుపల కాల్పులు జరిగాయి. దీనికి కూడా బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహించింది. గోల్డీ ధిల్లానే సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నాడు. నట్టన్ తమ గ్యాంగుకు వ్యక్తిగతంగా ఎలాంటి శత్రుత్వం లేదని పేర్కొన్నాడు. అయితే, గాయకుడు సర్దార్ ఖేరాతో నట్టన్‌కు పెరుగుతున్న సాన్నిహిత్యంవల్లే అతన్ని లక్ష్యంగా చేసుకున్నట్టు తెలిపాడు. ఖేరాతో కలిసి పనిచేసే ఏ గాయకుడినైనా తాము లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించాడు. ఈ కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భారత్‌తోపాటు విదేశాల్లో హత్యలు, దోపిడీలు, ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణావంటి కార్యకలాపాలతో సంబంధమున్న ఈ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఇటీవల కెనడా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఈ గ్యాంగ్ ఆగడాలు పెరుగుతుండటంపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఆ గ్యాంగ్‌ను ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

# పాక్ వైమానిక దాడులు

### బలోచ్ లిబరేషన్ ఆర్మీయే లక్ష్యం

పాకిస్థాన్ మరోసారి ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు ప్రారంభించింది. బలోచ్ లిబరేషన్ ఆర్మీ లక్ష్యంగా అర్ధరాత్రి వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో దాదాపు 14మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. బలోచిస్థాన్‌లోని చిల్తాన్ పర్వత ప్రాంతంలో బీఎల్ ఉగ్రవాదులే లక్ష్యంగా పాక్ బలగాలు కచ్చితమైన వైమానిక దాడులకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఉగ్రవాదులు చాలా రోజులుగా తమ నిఘాలో ఉన్నారని పాక్ పేర్కొంది. తాజా దాడుల నేపథ్యంలో ఉగ్రవాదులకు సంబంధించిన అనేక తాత్కాలిక రహస్య స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రావిన్స్‌లోని భద్రతా కాన్వాయ్‌లు, మౌలిక సదుపాయాలపైనా దాడులు జరిగినట్టు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. పాక్ తాజా దాడులపై బలోచిస్థాన్ ఇప్పటివరకు స్పందించలేదు.

# బంగ్లాలో పాక్ ఐఎస్ఐ పాగా

### - భారత్‌పై విషంచిమ్మే పన్నాగం



సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ భారత్‌తో తరచూ తగవు పెట్టుకుంటోన్న పాకిస్థాన్.. ఇప్పుడు మరో ఎత్తుగడ వేసింది. బంగ్లాదేశ్ వేదికగా న్యూఢిల్లీపై గూఢచర్యానికి పాల్పడేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఢాకాలోని తమ దౌత్య కార్యాలయంలో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రత్యేక సెల్ ఏర్పాటుకు ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరినట్టు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ నిఘా వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్లమీడియా కథనం వెల్లడించింది. గత కొంతకాలంగా బంగ్లాదేశ్, పాక్ మధ్య స్నేహబంధం పెరుగుతోంది. తాజాగా పాకిస్థాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్ జనరల్ సాహిర్ షంషద్ మీర్జా బంగ్లాదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రక్షణరంగంలో పరస్పరం మరింత విస్తృత సహకారం అందించుకోవాలని ఇరుదేశాలూ నిర్ణయించుకున్నాయి. పర్యటనలో భాగంగా షంషద్ మీర్జా నేతృత్వంలోని ఎనిమిదిమంది సభ్యుల బృందం.. బంగ్లా జాతీయ భద్రతా నిఘా సంస్థ (ఎన్ఎస్ఐ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫోర్సెస్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులతో చర్చలు జరిపింది..

ఈ సందర్భంగా ఢాకాలోని పాక్ హైకమిషన్‌లో నిఘా అధికారులను నియమించుకునేందుకు బంగ్లాదేశ్ అనుమతినిచ్చినట్టు సదరు కథనం వెల్లడించింది. దీంతో త్వరలోనే ఢాకా మిషన్‌లో ఐఎస్ఐ ప్రత్యేక సెల్ ఏర్పాటు కానున్నట్టు సమాచారం. ఈ సెల్లో ఐఎస్ఐ నుంచి ఒక బ్రిగేడియర్‌స్థాయి అధికారి, ఇద్దరు కల్నల్స్, నలుగురు మేజర్లు ఉండనున్నారట. భారత్‌పై మరింత నిఘా పెట్టేందుకే పాక్ ఈ కుయుక్తులు పన్నుతున్నట్టు తెలుస్తోంది. బంగ్లాలో భారత వ్యతిరేక శక్తులకు శిక్షణనిచ్చి ఢిల్లీపైకి ఎగదోయడమే దాయాది పన్నాగంగా తెలుస్తోంది.

ఈ సెల్ ఏర్పాటుకు అనుమతినిచ్చినందుకుగానూ.. బంగ్లాకు సైనిక శక్తిలో పాక్ సహకారం అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. సైన్యానికి సాంకేతిక సహకారం, శిక్షణ కార్యక్రమాలు, ఆయుధ వ్యవస్థల సరఫరా, సంయుక్త నౌకా, వాయుసేన విన్యాసాలు చేపట్టనున్నట్టు సదరు కథనాల సారాంశం. ఇక పాక్‌వద్దవున్న జేఎఫ్–17 థండర్ ఫైటర్ జెట్లపైనా ఢాకా ఆసక్తి కనబరుస్తోంది. త్వరలోనే బంగ్లాదేశ్ అత్యున్నతస్థాయి మిలిటరీ బృందం... పాక్‌లో పర్యటించి దీనిపై అవగాహన ఒప్పందం చేసుకోనున్నట్టు సమాచారం. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా స్థానంలో అధికార పగ్గాలు చేపట్టిన తాత్కాలిక ప్రభుత్వం క్రమంగా పాకిస్థాన్ పంచన చేరుతోంది. పాక్‌నుంచి ఆయుధాలు, ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టింది. ఇప్పటికే పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, బంగ్లా తాత్కాలిక సారథి యూనస్ పలుమార్లు ద్వైపాక్షికంగా భేటీ అయ్యారు. రెండు దేశాలమధ్య తరచూ సైనికాధికారుల పర్యటనలు కొనసాగాలని పాక్, బంగ్లా అంగీకారానికి వచ్చాయి.

# ఆస్ట్రేలియా, భారత్ తొలి టీ20 వర్షార్పణం

◆ మ్యాచ్ రద్దు చేస్తూ నిర్ణయం

కాన్‌బెర్రా: టీమిండియా-ఆస్ట్రేలియా మధ్య కాన్‌బెర్రా వేదికగా బుధవారం మొదలైన తొలి టీ20 వర్షం కారణంగా అర్ధాంతరంగా రద్దు అయింది. కేవలం 9.4 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. టాస్ గెలిచిన ఆసీస్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట నిలిచిపోయే సమయానికి వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా మొదటి నుంచే దూకుడుగా ఆడే ప్రయత్నం చేసింది. ఓపెనర్‌గా వచ్చిన అభిషేక్ శర్మ క్రీజులో ఉన్నంత సేపు దూకుడు ప్రదర్శించినా అనుకున్నంత స్థాయిలో రాణించలేకపోయాడు. నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో అతడు ఫీల్డర్ మీదుగా ఫోర్ కొట్టే ప్రయత్నంలో బంతిని గాల్లోకి లేపాడు. దాన్ని టిమ్ డేవిడ్ ఎలాంటి పొరపాటు చేయకుండా ఒడిసి పట్టుకున్నాడు. దీంతో అభిషేక్ శర్మ 19 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో టీమిండియా తన తొలి వికెట్‌ను 35 పరుగుల వద్ద కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, గిల్‌తో కలిసి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు.

ఈ క్రమంలో 5 ఓవర్లు ముగిసిన తర్వాత వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. తర్వాత కాసేపటికి వాన ఆగిపోవడంతో మ్యాచ్ తిరిగి ప్రారంభమైంది. అయితే ఆటను అప్పటికే 18 ఓవర్లకు కుదించారు. సూర్య 18 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. జేవియర్ బ్రేట్‌లెట్ బౌలింగ్‌లో సూర్య ఇచ్చిన క్యాచ్‌ను జోష్ ఫిలిప్ పట్టుకోలేకపోయాడు. అనంతరం మరింత జాగ్రత్తగా ఆడిన గిల్, సూర్య రెండో వికెట్‌కు 32 బంతుల్లోనే అర్ధ శతక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

**రికార్డు సృష్టించిన సూర్య..**

టీమిండియా ఆటగాళ్లు మరింత దూకుడుగా ఆడుతున్న తరుణంలోనే 9.4 ఓవర్ల వద్ద వరుణుడు మరోసారి ఆటకు ఆటంకం కలిగించాడు. అప్పటికి భారత్ స్కోర్ వికెట్ నష్టానికి 97 పరుగులు. రెండోసారి మ్యాచ్ ఆగడానికి ముందు నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో సూర్య సూపర్ సిక్స్ బాదాడు. ఇది అతడికి టీ20ల్లో 150వ సిక్స్. అతడు 86 ఇన్నింగ్స్‌ల్లో, 1649 బంతులు ఎదుర్కొని ఈ ఘనతను సాధించాడు. తర్వాత ఆటను కొనసాగించే పరిస్థితులు లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను అర్ధాంతరంగా ముగించారు. మ్యాచ్ ఆగే సమయానికి క్రీజులో శుభ్‌మన్ గిల్(37), సూర్యకుమార్ యాదవ్(39) నాటౌట్‌గా నిలిచారు.



**మూడు మ్యాచ్‌లకు నితీశ్ దూరం!**

టీమిండియా ఆటగాళ్లను గాయాల బెడద వేధిస్తోంది. ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. రెండో వన్డేలో తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్‌రెడ్డి గాయంతో వైదొలిగాడు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నాడు. కాగా నితీశ్ గాయంపై బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చింది. 'నితీశ్ కుమార్ రెడ్డి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఇప్పుడు ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు నితీశ్ దూరంగా ఉంటాడు. అతడు ఎడమ తొడ కండరాల నొప్పి నుంచి కోలుకుంటున్నాడు. అడిలైడ్‌లో నితీశ్ గాయంతో ఇబ్బంది పడ్డాడు. మెడ నొప్పితో పాటు ఇతర సమస్యలు ఉన్నాయని వైద్యుల దృష్టికి తీసుకొచ్చాడు. అతడిని మా మెడికల్ టీమ్ నిరంతరం పర్యవేక్షిస్తోంది' అని బీసీసీఐ పోస్ట్ పెట్టింది.

## వన్డేల్లో నెంబర్ 1 రోహిత్ శర్మ

సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడిన టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అదరగొట్టాడు. ఏడు నెలల విరామం తర్వాత ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడిన హిట్‌మ్యాన్.. ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు కూడా సొంతం చేసుకున్నాడు. ఆ సిరీస్‌లో రోహిత్ ప్రదర్శనకు ఐసీసీ ర్యాంకుల్లో ఫలితం కనిపించింది. హిట్‌మ్యాన్ వన్డేల్లో టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు కిందికి దిగజారి మూడో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అఫ్గానిస్తాన్ ప్లేయర్ ఇబ్రహీం జద్రాన్ 764 పాయింట్ల తో రెండో స్థానంలో ఉండగా.. గిల్ (745), బాబర్ అజామ్(739), విరాట్ కోహ్లీ (725) పాయింట్లతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్‌తో జరిగిన మూడు వన్డేల్లో తొలి రెండు మ్యాచ్‌ల్లో విరాట్ కోహ్లీ డకౌట్‌గా వెనుదిరిగిన విషయం తెలిసిందే. మూడో వన్డేలో పుంజుకుని హాఫ్ సెంచరీ చేసినా.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో విరాట్ ఓ స్థానం కిందకి పడిపోయాడు. డకౌట్ అవ్వడమే దీనికి ముఖ్య కారణమని క్రికెట్ విశ్లేషకుల అంచనా. శ్రేయస్ అయ్యర్(700) టాప్-10లో కొనసాగు తున్నాడు. ఇక ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (589) ఏకంగా 23 స్థానాలను మెరుగుపర్చుకుని 25వ ర్యాంకును అందుకున్నాడు.



**బౌలింగ్ విభాగంలో ఒక్కడే..**

బౌలింగ్ విభాగంలో టీమిండియా తరపున కేవలం ఒక్కరు మాత్రమే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఉండటం గమనార్హం. అదీ కూడా కుల్‌దీప్ యాదవ్ 634 పాయింట్లతో ఒక స్థానం కిందికి పడిపోయి ఏడో ర్యాంకులో నిలిచాడు. ఆసీస్ స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ (628) రెండు స్థానాలు పైకి ఎగబాకి 8వ ర్యాంకులో ఉన్నాడు. అఫ్గాన్ ఆటగాడు రషీద్ ఖాన్(710) బౌలింగ్ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా(215) మాత్రమే ఉన్నాడు. అతడు ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్ ఆడని విషయం తెలిసిందే. అక్షర్ పటేల్(208) రెండు స్థానాలను మెరుగుపర్చుకుని 12వ ర్యాంకులో నిలిచాడు. ఇందులోనూ అఫ్గాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్(334) టాప్ ర్యాంకర్.

## మహిళల వరల్డ్ కప్..ఫైనల్‌కు దక్షిణాఫ్రికా




◆ అదరగొట్టిన కెప్టెన్ లారా వోల్వార్ట్

◆ 143 బంతుల్లో 169

◆ చిత్తుగా ఓడిన ఇంగ్లండ్

దక్షిణాఫ్రికా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ తుది పోరుకు చేరి వరుసగా రెండో ఫైనల్‌పై గురిపెట్టిన ఇంగ్లండ్ కలలు కల్లలయ్యాయి. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో నాలుగుసార్లు చాంపియన్ ఇంగ్లండ్ బోర్లా పడి ఓటమి చవిచూసింది. లీగ్ దశలో సఫారీలను చిత్తుగా ఓడించిన ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టులో కెప్టెన్ లారా వొల్వార్డ్ పిచ్చకొట్టుడు కొట్టడంతో ఏడు వికెట్లు కోల్పోయి 319 పరుగుల భారీ స్కోరు చేసింది. వోల్వార్ట్ 143 బంతుల్లో 20 ఫోర్లు, 4 సిక్సర్లతో 169 పరుగులు చేసి సంచలన ఇన్నింగ్ ఆడింది. 40.1 ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న జట్టు చివరి 10 ఓవర్లలో 117 పరుగులు చేయడంతో మ్యాచ్‌లో పట్టు సాధించింది. మారిజోనా కాప్ 33 బంతుల్లో 42, చివర్లో క్లో ట్రేయాన్ 26 బంతుల్లో 33 రాణించారు.

**ఇంగ్లండ్ ఆరంభంలోనే డకౌట్**

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు తొలి ఓవర్‌లోనే పరుగులేమీ చేయకుండా రెండు వికెట్లు కోల్పోయింది. రెండో ఓవర్‌లో మూడో వికెట్ కోల్పోయింది. వరుసగా ముగ్గురు అమీ జోన్స్, టమ్మిన్ బ్యూమాంట్, హీదర్ నైట్ డకౌట్ అయి చరిత్ర సృష్టించారు. ఈ దశలో నాలుగో వికెట్‌కు బ్రంట్, కాప్సే 106 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఆదుకునే ప్రయత్నం చేశారు. బ్రంట్ 64 పరుగులు, కాప్సే 50 పరుగులు చేసి అవుట్ అయ్యారు. అనంతరం క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో 194 పరుగులకు ఆలౌట్ అయి పరాజయం చవిచూసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మారిజోనా కాప్ అద్భుత ప్రదర్శన కనబరిచి 5 వికెట్లు తీసి ఇంగ్లండ్ పతనాన్ని శాసించింది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగే మరో సెమీఫైనల్‌లో ఆసీస్, భారత్ జట్లలో ఎవరు గెలిస్తే వారితో ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

## శ్రేయస్ అయ్యర్‌కు సర్జరీ జరగలేదు

టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో తీవ్రం గా గాయపడిన విషయం తెలిసిందే. క్యాచ్ అందుకునే క్రమంలో పక్కటెముకలు నేలను బలంగా తాకడంతో అతడి ప్లీహానికి గాయమై అంతర్గతంగా రక్తస్రావం అయింది. దీంతో అయ్యర్‌ను ఐసీయూలో చేర్చారని వార్తలు వచ్చాయి. అయితే బీసీసీఐ మాత్రం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని వెల్లడించింది. శ్రేయస్‌కు సర్జరీ జరిగిందని, కనీసం ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై తాజాగా బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మరోసారి స్పందించారు. 'శ్రేయస్ అయ్యర్ ఆరోగ్యంగానే ఉన్నాడు. వైద్యులు అనుకున్న దాని కంటే వేగంగా కోలుకుంటున్నాడు. శ్రేయస్ ఎలాంటి సర్జరీ చేయించుకోలేదు. భిన్నమైన వైద్య ప్రక్రియతో అంతర్గత రక్తస్రావం జరగకుండా చూశారు. డాక్టర్ రిజ్వాన్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నా. సిడ్నీ ఆసుపత్రిలోనే టీమిండియా వైద్యుడు కూడా ఉన్నారు. అయ్యర్ పూర్తిగా కోలుకుని రావడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుందని అనుకుంటున్నాం. కానీ అతడి తీరు చూస్తే ఇంకాస్త ముందుగానే కోలుకున్నా ఆశ్చర్య పోనక్కర్లేదు. వైద్యులు కూడా శ్రేయస్ పరిస్థితి మెరుగుదలపై సంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికే అతడు తన రోజువారీ కార్యక్రమాలను చేసుకుంటున్నాడు. అతడి గాయం తీవ్రమైందే కావచ్చు కానీ ప్రమాదం నుంచి అయితే బయటపడ్డాడు. ఇప్పటికే ఐసీయూ నుంచి అతడిని సాధారణ రూమ్‌కు మార్చారు' అని సైకియా తెలిపారు.



**అవన్నీ అవాస్తవాలు..**

'చాలా సోషల్ మీడియా ఛానళ్లలో శ్రేయస్‌కు సర్జరీ జరిగిందని వార్తలు వస్తున్నాయి. కానీ అతడికి ఎలాంటి సర్జరీ జరగలేదు. బయట వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలు. అతడి ప్లీహంలో అంతర్గత రక్తస్రావం ఆపేందుకు భిన్నమైన వైద్య ప్రక్రియను చేపట్టారు. అందుకే చాలా త్వరగా రికవరీ అవుతున్నాడు. ఇలాంటి గాయాలు ఉన్నప్పుడు కనీసం వారం రోజులు ఆసుపత్రిలోనే ఉండాలి. వేగంగా కోలుకుంటున్నప్పటికీ శ్రేయస్ కూడా ఆసుపత్రిలోనే ఉంటాడు' అని సైకియా స్పష్టం చేశాడు. కాగా అయ్యర్ కుటుంబసభ్యులు ఇప్పటికే ఆస్ట్రేలియాకు పయనమయ్యారు.

## రింకూ-ప్రియ సరోజ్ ప్రేమ కథ

ముంబై: టీమిండియా స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నాడు. ఇటీవల తన ప్రియురాలు, రాజకీయ నాయకురాలు ప్రియా సరోజ్‌తో రింకూ నిశ్చితార్థం చేసుకున్నాడు. అయితే ఒకరు క్రికెట్‌లో మరొకరు రాజకీయాల్లో ఉన్న ఈ ఇద్దరు సెలబ్రిటీల మధ్య ప్రేమ ఎలా చిగురించింది? వారి లవ్ స్టోరీ ఎక్కడ మొదలైంది? అనే ఆసక్తి అందరిలో ఉంది. కాగా వీరి ప్రేమకు సంబంధించిన సీక్రెట్ రింకూ సింగ్ చెల్లెలు నేహా సింగ్ ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించింది. 'రింకూ సింగ్, ప్రియా సరోజ్‌ల బంధం ఏర్పడటానికి ప్రధాన కారణం బట్టల వ్యాపారం. ఇన్‌స్టా ద్వారా వీరి మధ్య పరిచయం మొదలైంది. మా వదిన ప్రియా అలీగఢ్‌లో ఉంటుంది. ఆమెకు అక్కడ బట్టల వ్యాపారం ఉంది. తమ వ్యాపారం గురించి రింకూ తన ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేయాలని కోరింది. ఇలా ఆ వ్యాపారం గురించి వీరి మధ్య మెసేజ్‌లు మొదలయ్యాయి. ప్రియాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. రింకూ సింగ్ గురించి ముందే నుంచే తనకు తెలుసు. పరిచయం కాకముందే నుంచే అతడిపై ప్రియాకు అభిమానం ఉంది. అలా ఆ అభిమానం కాస్తా ప్రేమ, నిశ్చితార్థం వరకు వచ్చాయి. నాకు, మా వదిన ప్రియాకు మధ్య కూడా మంచి అనుబంధం ఉంది. తను ఎంత బిజీలో ఉన్నా.. నేను ఫోన్ చేస్తే కచ్చితంగా లిఫ్ట్ చేసి మాట్లాడుతుంది' అని నేహా సింగ్ వెల్లడించింది.

చైతన్య రథం సినిమా

గురువారం 30 అక్టోబర్ 2025



# ఎంతకైనా.. సల్మాన్ అర్హుడే



'బిగ్ బాస్'కి సంబంధించి సల్మాన్‌ఖాన్ పారితోషికంపై వచ్చిన రూమర్స్‌పై ఆ రియాలిటీ షో నిర్మాత రిషి నెగి స్పందించారు. రెమ్యూనరేషన్ ఎంతైనా, దానికి సల్మాన్ అర్హుడని పేర్కొన్నారు. సల్మాన్, ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్ మధ్య అగ్రిమెంట్ ఉందని, అందుకే ఆ పారితోషికం ఎంతనేది తాను చెప్పలేనన్నారు. "ఈ షోతో సల్మాన్ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. 'నేను హోస్టింగ్ ఆపేస్తా' అని ఆయన పలు సీజన్లకు చెప్పినప్పటికీ.. మళ్లీ చేస్తుండటం మా అదృష్టం" అని అన్నారు. హిందీ 'బిగ్బాస్'.. సీజన్ 4 నుంచి ప్రస్తుతం ప్రసారమవుతున్న సీజన్ 19 వరకూ సల్మానే వ్యాఖ్యాత. ప్రతి సీజన్‌కు ఆయన రూ.150కోట్లు నుంచి రూ.200 కోట్లు తీసుకున్నారంటూ జరిగిన ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్'లో నటిస్తున్నారు. 2020లో గాల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల నేపథ్యంతో రూపొందుతున్న చిత్రమిది. అపూర్వ లాఖియా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో సల్మాన్ ఆర్మీ అధికారిగా కనిపించనున్నారు.

# రవితేజ లేకుంటే నేను లేను




రవితేజ.. నా బతుకుదేవుడు అంటున్న సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాటలు అందరినీ కదిలిస్తున్నాయి. ఒకప్పుడు అవకాశాలు లేక కుటుంబంతో సహా చనిపోదాం అనుకున్న సమయంలో దేవుడిలా రవితేజ కాపాడాడని.. ఆయన లేకపోతే తాను లేనన్నాడు భీమ్స్. ప్రస్తుతం భీమ్స్ మాటలు వైరల్ అవుతున్నాయి. "నేను ఏ విషయాన్నైనా పాట రూపంలో తెలుపుతాను. ఒకసారి నా పరిస్థితిని తెలుపుతూ ఒక సెల్ఫీ వీడియో తీసుకున్నా. అందులో నా భార్య పిల్లలు కూడా కనిపించేలా తీశాను. నేను ఎందుకు వీడియో తీస్తున్నానో అప్పుడు వాళ్లకు తెలియదు. ఇంటికి అద్దె ఎలా కట్టాలి? పిల్లల్ని ఎలా చదివించాలి? ఎలా బతకాలి? అని ఆలోచిస్తూ ఆ వీడియో తీశాను. అప్పుడు చిట్టచివరి క్షణంలో నాకు ఒక ఫోన్ వచ్చింది. మీరు పీపుల్స్ మీడియా ఆఫీసుకు రావాలి అని.. ఆ కాల్ నా జీవితాన్ని మార్చేసింది" అంటూ మాస్ జాతర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భీమ్స్ ఎమోషనలయ్యాడు. "ఆ ఫోన్ రావడానికి క్షణం ముందు నా ఆలోచనలు ఎలా ఉన్నాయంటే.. ఈ భూమి మీద నాకు నూకలు చెల్లిపోయాయి. నాకు జీవితం లేదు. నా భార్యాపిల్లలకు కూడా జీవితం లేదు. అందరం కలిసి పైకి వెళ్లిపోదాం.. అని అనుకుంటున్నా. ఆ క్షణంలో నేను కొలిచే దేవుడి రూపంలో రవితేజ నుంచి ఫోన్ వచ్చింది. ఆయనంటే మాటల్లో చెప్పాలంటే ప్రేమ, పాటల్లో చెప్పాలంటే భక్తి. నేను ఈరోజు ఇక్కడ నిలబడి ఉన్నానంటే, రోజూ అన్నం తింటున్నానంటే ఆయనే కారణం. ఒక్క మాటలో చెప్పాలంటే నేను సజీవంగా ఉన్నానంటే రవితేజనే కారణం. ఆయనలాంటి వాళ్లు ఇండస్ట్రీలో ఉంటే నాలాంటి వాళ్లు ఎంతోమంది వస్తారు. ఎంతోమందికి ఆయన స్ఫూర్తి. అందుకే ఆయనంటే నాకు చాలా ఇష్టం" అని భీమ్స్ సిసిరోలియో ఎమోషనల్ అయ్యారు.

2012లో 'నువ్వానేనా'తో ఇండస్ట్రీకి వచ్చిన భీమ్స్ సిసిరోలియో.. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం'లో ఆయన స్వరపరిచిన 'గోదారిగట్టు మీద..' సాంగ్ రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. చిరంజీవి హీరోగా రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు'కు కూడా భీమ్స్ స్వరాలు అందిస్తున్నారు. దీనికంటే ముందు 'మాస్ జాతర'తో పలకరించనున్నారు. రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఛాన్సిస్తే చేస్తా.. ఇప్పుడు చేయట్లేదు



చిరంజీవి సినిమా ప్రకటించారంటే ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ఎన్నో వార్తలు నెట్టింట వైరల్ అవుతాయి. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఇంకా పట్టా లెక్కని చిత్రంపై సోషల్ మీడియాలో వార్తలు మొదలయ్యాయి. ఇందులో ఆయన సరసన మాళవికా మోహనన్ నటించనున్నారంటూ జోరుగా ప్రచారం సాగింది. తాజాగా వాటిపై మాళవిక స్వయంగా స్పందించారు. ఆ రూమర్స్‌ను కొట్టిపారేశారు. "బాబీ దర్శకత్వంలో రానున్న మెగా 158లో నేను నటించనున్నట్లు సోషల్ మీడియాలో వచ్చే వార్తలు అవాస్తవం. నా కెరీర్‌లో ఒక్కసారైనా చిరంజీవిలాంటి అగ్ర హీరోతో నటించాలని కోరుకుంటున్నాను. ఆరోజు కోసం ఎదురుచూస్తున్నా. కానీ, ఈ ప్రాజెక్ట్ నేను భాగం కాదు" అని స్పష్టతనిచ్చారు. దీంతో ఈ రూమర్స్‌కు తెరపడింది. ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' రూపొందుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది విడుదల కానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర' రానుంది. వీటితోపాటు శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు ప్రాజెక్టులు లైనప్‌లో ఉన్నాయి. ఇక మాళవిక 'ది రాజాసాబ్'తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకురానుంది.

# కొత్త ప్రాజెక్టుకు పవన్ ఓకే?



ఇటీవల వచ్చిన పవన్ కళ్యాణ్ చిత్రాలు 'హరిహర వీరమల్లు', 'ఓజీ' మరోసారి ఆయన స్టామినాను గుర్తు చేశాయి. ఓజీ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాన్ని అందుకోవడంతో.. పవన్ ఫ్యాన్స్ ఊపుమీదున్నారు. అభిమాన హీరోనుంచి రాబోయే 'ఉస్తాద్ భగత్ సింగ్' మూవీ కూడా బ్లాక్‌బస్టర్ హిట్టవుతుందన్న నమ్మకం ప్రదర్శిస్తున్నారు. అయితే.. ఉస్తాద్ తరువాత.. పవన్ సినిమాలకు దూరంకావొచ్చన్న బెంగ ఫ్యాన్స్‌ని వెంటాడుతోంది. అయితే, ఇటీవల పవన్ మరో సినిమాకు అడ్వాన్స్ కూడా తీసుకున్నట్టు ఇండస్ట్రీలో టాక్ నిపిస్తున్న నేపథ్యంలో ఫ్యాన్స్‌లో ఉత్సాహం ఉరకలేస్తోంది. చిరంజీవి–బాబీ కాంబినేషన్‌లో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న కెవీఎన్ ప్రొడక్షన్స్, పవన్ కళ్యాణ్‌కు రూ.20 కోట్ల భారీ అడ్వాన్స్ చెల్లించిందన్నది తాజాగా వినిపిస్తోన్న టాక్. పవన్ ఈ బ్యానర్‌లో సినిమా చేయడానికి అంగీకరించారని తెలుస్తోంది. అయితే, పవన్ కొత్త ప్రాజెక్టును డైరెక్ట్ చేసేది ఎవరనేది తెలియాల్సి ఉంది.

# భవిష్యత్‌లో.. భారత్ ప్రభంజనమే!

'కొవిడ్ తరువాత యానిమేషన్ రంగంలో కొంత స్తబ్దత కనిపించినప్పటికీ.. కొన్నాళ్లుగా పుంజుకుంది. భారత్ మరో ఏడేళ్లలో యానిమేషన్ హబ్ ఎదుగుతుంద'ని ఆకాంక్షించారు దర్శకుడు అశ్విన్‌కుమార్. ఇటీవల విడుదలైన యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహా'తో భారీ విజయాన్ని అందుకున్నారాయన. తాజాగా హైదరాబాద్‌లో ఓ యానిమేషన్ కార్యక్రమానికి హాజరైన ఆయన –ఆసక్తికరమైన అంశాలు పంచుకున్నారు.



యానిమేషన్ రంగంపై యువతరం మక్కువ చూపుతున్నారా? అన్న ప్రశ్నకు మహావతార్ నరసింహ సినిమాకి యువ ప్రతిభావంతులే ఎక్కువగా పని చేశారని ఆసక్తికరమైన సమాధానమిచ్చారు. ఏఐ ప్రభావం యానిమేషన్ రంగంపై ఎలా ఉంటుందన్న ప్రశ్నకు.. అనైతికంగా కాకుండా నైతికంగా ఏఐని వాడుకోవాలి. యానిమేషన్ ద్వారా ఏదైనా సృష్టించానుకున్నప్పుడు ఎక్కువ సమయం పడుతుంది. అదే సమయంలో –ఏఐ అన్నిరకాల పనులు చేయలేదన్న విషయాన్నీ గ్రహించాలన్నారు. భవిష్యత్తులో యానిమేషన్ పరిశ్రమ ఎలా ఉండబోతుందన్న ప్రశ్నకు –ప్రభంజనాలు సృష్టించడానికి సిద్ధమైంది. రానున్న ఏడేళ్లలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద యానిమేషన్ పరిశ్రమగా ఎదగనుందని సమాధానమిచ్చారు. పిల్లల మొదలు పెద్దల వరకు అన్ని వయసుల వారినీ ఆకట్టుకునే వినోద సాధనం యానిమేషనేనన్నారు 'మహావతార్ నరసింహా' చిత్ర నిర్మాణానికి నాలుగున్నరేళ్లు పట్టిందన్నారు. అయితే ఇప్పుడు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగల సత్తావున్న నిపుణులున్నారని, ఆ ధైర్యంతోనే మరో ఆరు కథలు సిద్ధం చేసినట్టు చెప్పుకొచ్చారు. ఒకొక్కటి రూపొందించడానికి రెండున్నరేళ్లు పడుతుంది. దీంతోపాటు మహావతార్ బ్యానర్‌పై గేమింగ్, కామిక్‌లాంటివీ తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్టు చెప్పుకొచ్చారు.



# అందుకే.. స్లిమ్ అయ్యిందట

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం 'మాస్ జాతర'తో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు రెడీ అయింది. ఈ సినిమాలో రవితేజ సరసన రెండోసారి జోడీకట్టింది ఈ బ్యూటీ. చిత్ర ప్రమోషన్స్‌ను శరవేగంగా నిర్వహిస్తున్నారు చిత్ర యూనిట్. ఇందులో భాగంగా శ్రీలీల తన స్లిమ్ లుక్‌పై కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ప్రేక్షకులు డబ్బులు పెట్టి సినిమాకు వస్తారు. వారికి బెస్ట్‌గా కనిపించేందుకు తాను ప్రయత్నిస్తున్నానని.. దీని కోసం తాను తినే ఫుడ్‌పై కంట్రోల్ పెట్టుకుంటున్నట్టు తెలిపింది. చిరుతిళ్లు మానేసి, తాను గతంలో తినే ఫుడ్‌పై కూడా కంట్రోల్ పెట్టుకున్నట్టు తెలిపింది.కేవలం స్లిమ్‌గా మారడమే కాకుండా ఆరోగ్యంగా ఉండేందుక పాటించాల్సిన విషయాలపైనా తాను శ్రద్ధ తీసుకుంటున్నానంటోంది.ఏదేమైనా స్లిమ్‌గామారడానికి గల కారణాలను శ్రీలీల తన ఫ్యాన్స్‌తో పంచుకుంది.